# ఆదోని అభివృద్ధికి చర్యలు - కలెక్టర్

**: ఉపాధ్యాయుల ఖాళీలపై నివేదిక ఇవ్వాలని డీఈవోకు ఆదేశం**



2లో

**కర్నూలు, జూలై 26, ప్రభాతవార్త :** ఆదోని ఏరియా సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం ఆదోని ఏరియా డెవలప్మెంట్ పై సంబంధిత జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ జూమ్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక మంత్రి వర్యుల సూచనల మేరకు ఆదా యొక్క స్వరూపాన్ని మార్చే విధంగా పెద్ద ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. పంది కోన రిజర్వాయర్ ద్వారా కుడి,ఎడమ కాలువ ల కింద నిర్దేశించిన 60 వేల ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా కు సంబంధించి అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయడం, సి.బెళగల్ ట్యాంకు సామర్థ్యాన్ని పెంచి మైక్రో ఇరిగేషన్ ద్వారా సాగు నీరు,తాగునీటిని అందించడం, ఆస్ప రి ప్రాంతంలోని 10 చెరువులకు హంద్రీ నీవా ద్వారా నీటిని అందించడం పై ప్రతిపా దనలు రూపొందించాలని కలెక్టర్ ఇరిగేషన్ ఎస్ఈ శేఖర్ రెడ్డిని ఆదేశించారు.. అలాగే రోడ్లు భవనాల శాఖ ద్వారా రోడ్లతో ఉద్యోగ అవకాశాలు గల ప్రదేశాలు, అటు కర్ణాటక ఇటు ఆంధ్ర ప్రదేశ్ లోని ముఖ్య ప్రదేశాలకు ,విద్యా కేంద్రాలకు , పర్యాటక ప్రదేశాలకు అనుసంధానం చేయగలిగితే ఈ ప్రదేశము అభివృద్ధి చెందుతుందని, ఆ మేరకు ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్ ఎస్ ఈ ని ఆదేశించారు.. టెక్స్టైల్ పార్క్, బవనాసి వ్యవసాయ క్షేత్రం లో ఫాడర్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ తో పాటు అమూల్ మోడల్ లో టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు అధ్యయనం చేయాల్సి ఒదిగా పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు.ఆదోని, దేవనకొండ ప్రాంతాల్లో ఆనియన్ స్టోరేజ్ గోడౌన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదోని ప్రాంతంలో ఉన్న రామజల చెరువు సుందరీ కరణ, గోనెగండ్ల మండలం గాజులదిన్నె గ్రామంలోని దామోదరం సంజీవయ్య ప్రాజెక్టు నందు బోటింగ్, రెస్టారెంట్ తదితర టూరిజం ప్రాజెక్టుల ఏర్పాటుపై ఆదోని సబ్ కలెక్టర్ జిల్లా కలెక్టర్ కు వివరించారు. సదరు అంశంపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఈ ప్రాజెక్టులకు సంబంధించి ఆదా..


కర్నూలు I నంద్యాల

వార్త

27 జూలై , 2023 గురువారం పేజీలు 4


## మిస్సయిన మహిళల్లో చాలా మందిని ట్రేస్ చేశాం

**: ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం 26 వేల మంది మిస్ అయితే 23,300 మంది ఇళ్లకు చేరారు**

**: డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి**

2లో

**కర్నూలు, జూలై 26, ప్రభాతవార్త :** జాతీయ నేర ఘణాంకాల విభాగం లెక్కల మేరకు రాష్ట్రంలో 26వేల మంది మహిళలు మిస్ అయ్యారు... వారిలో 23,300 మంది ఇళ్లకు చేరారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి వివరించారు. ఈ విషయంలో పోలీసు శాఖ అప్రమత్త ంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. బుదవారం ఆయన ఉమ్మడి కర్నూలు జిల్లాలో పర్యటించారు. కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లా పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. నేర నియంత్రణకు తీసుకోవలసిన విషయాల పై ఉమ్మడి జిల్లా అడిషనల్ ఎస్పీలు, డిఎస్పీలు ,సిఐలకు పలు సూచనలు, సలహాలు చేసి దిశా నిర్దేశం చేశారు. అనంతరం రాష్ట్ర డిజిపి కెవి రాజేంద్రనాథ్ రెడ్డి కర్నూలు పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో కర్నూలు జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీరారెడ్డిలతో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించారు. రాష్ట్రంలో మిస్సింగ్ కేసులలో 26వేల మందిలో 23,300 మందిని గుర్తించి ఇళ్ళకు చేర్చామన్నారు. నేరాలు తగ్గించడమే ముఖ్య లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.




# అద్దె గదిలో.. ఐదు తరగతులు..!

**- 50 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు - పట్టించుకోని విద్యాశాఖ అధికారులు**





**విద్యార్థులు కార్పొరేట్ విద్యను అందిస్తామని ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. తీరా చూస్తే ఎక్కడా కూడా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు ఉండడం లేదు.అలాగే విద్యార్థులకు సరిపడా భవనాలు కూడా లేవు. కొన్ని చోట్ల అద్దె భవనాల్లో అరకొర సౌకర్యాల మధ్య చదువు కుంటున్నారు. గోనెగండ్ల మండలంలోని అయ్యకోండ గ్రామంలో ఒకే అద్దె గదిలో ఐదు తరగతులు కొనసాగుతున్నాయి. పాఠశాలలో 50 మంది విద్యార్థులు ఉండగా, వీరికి ఒకే ఉపాధ్యాయుడు బోధన చేస్తున్నాడు.దీంతో విద్యార్థులకు విద్యబోధన సక్రమంగా అందడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు,విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో గత విద్యాసంవత్సరం నుంచి ఒకే ఉపాధ్యాయుడే ఐదు తరగతులకు విద్య బోధిస్తున్నాడు. ఏవైనా ప్రభుత్వ సమావేశాలు ఎంఈవో కార్యాలయంలో ఉంటే ఆ రోజు పాఠశాలకు సెలవు ప్రకటించాల్సిందే.**

**గోనెగండ్ల ప్రభాతవార్త :**

**అధ్వానంగా అద్దె గది :** ఉన్న పాత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో గత ఏడాది నాడు నేడు పథకం కింద కొత్త భవన నిర్మాణ పనులు చేపట్టారు.అయితే పనులు నత్తనడకన సాగుతున్నాయి.భవన నిర్మాణ పనుల పూర్తి కావడం లేదు. దీంతో విద్యార్థులకు బోధన చేసేందకుగాను రూ.3వేలకు ఒక గదిని అద్దెకు తీసుకున్నారు.గదిలో విద్యార్థులు కుర్చోనేందుకు కూడా స్థలం సరిపోవడం లేదు. కావున ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలలో ఉపాధ్యాపోస్టులను భర్తీ చేయాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**విద్యార్థుల ఇక్కట్లు :** మునిస్వామి,ఏఐఎస్ఎఫ్ సంఘం తాలూకా అధ్యక్షుడు

తరగతి గదిలో కూర్చోవడానికి స్థలం కూడా సరిపడటం లేదు.ఉన్నది ఒకే గది.అందులోనే అన్ని సర్దుకోవాలి,ఉన్న ఒక్క ఉపాధ్యాయుడికి పనిభారం ఉడటంతో విద్యాబోధన సక్రమంగా సాగడం లేదు.మధ్యాహ్నం భోజనం కూడా నిర్వహణ లోపం ఉంది.అధికారులు స్పందించి త్వరగా పాఠశాల సమస్యలు పరిష్కరించాలి

**సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.: నీలకంఠప్ప** ఎంఈవో2,గోనెగండ్ల.

అయ్యకొండలో పాఠశాల సమస్యలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.అద్దె భవనంలో విద్యాబోధన జరుగుతున్న విషయం వాస్తవమే నూతన భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. మరో మూడు నాలుగు నెలలో భవన నిర్మాణ పనులు పూర్తి అవుతాయి. వచ్చే నెలలో ఉపాధ్యాయుల సమస్యను పరిష్కరిస్తాం.



## జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన.. నారాయణ విద్యార్థి



**కర్నూలు విద్య, జూలై 26, ప్రభాతవార్త:** మాధవనగర్‌లోని నారాయణ పాఠశాల విద్యార్థి (6వ తరగతి) విశ్వేష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యారని నారాయణ స్కూల్స్ ఏజిఎం రమేష్ కుమార్ తెలిపారు. బుధవారం పాఠశాలలో ప్రిన్సిపాల్ మహమ్మద్ అల్తాఫ్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో కరాటే పోటీల్లో రాణించిన విద్యార్థిని ఏజిఎం అభినందించారు. ఈసందర ్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి శారీరక ధృడత్వం ముఖ్యమన్నారు. వైజాగ్‌లో అండర్-10 విభాగంలో మూడవ ఏపీ స్టేట్ కరాటే చాంఫియన్‌షిప్-2023 అధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో విశ్వేష్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించారన్నారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటి మైదానంలో జిల్లాస్థాయిలో బంగారు పతకం సాధించగా, వరుసగా రాష్ట్ర స్థాయిలో సైతం బంగారు పతకం సాధించి వచ్చే నెలలో చండీగర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ దుర్గాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**- జోరువానలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం**

**- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం**



**దేవనకొండ,జూలై 26,ప్రభాతవార్త** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. బుధవారం మండలంలోని గుండ్లకొండ,ఎంకె కొట్టాల గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మంత్రి గ్రామ సచివాలయాన్ని పర్యవేక్షించి గ్రామంలో అందిస్తున్న సచివాలయ సేవల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి జయరాం మాట్లాడుతూ గ్రామస్థాయిలోనే ప్రజా సమస్యలు స్వస్తి పలకాలనే ఉద్దేశ్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందించి ప్రజల దీవెనలు పొందాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్విఘ్నంగా సాగుతోంది జోరువానను సైతం లెక్క చేయకుండా మంత్రి జయరాం ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరిస్తూ ప్రజల ఆశీస్సు లు పొందుతున్నారు. గడప గడపకు కార్యక్రమంలో జోరువానను సైతం లెక్కచేయకుండ ప్రజలను కలుసుకుని వారికి ప్రభుత్వం చేసిన సహాయాన్ని వివరిస్తూ వారికి ఏమైన సమస్యలుంటే వాటిని తెలుసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని అన్నారు. గుండ్లకొండ గ్రామ పంచాయతీలో ఇప్పటివరకు అర్హత ఉన్న వారందరికి వివిధ సంక్షేమ పథకాలతో సుమారుగా రూ.7కోట్ల75లక్షలు లబ్ది చేకూర్చామని తెలియజేశారు. గ్రామంలో రూ.10లక్షలు మెయిన్‌రోడ్డు,మౌలిక సదుపాయాలకు, రూ.10లక్షలు డ్రైనేజీ కాలువల ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు,గుమ్మనూరు నారాయణస్వామి,జడ్పిటిసి కిట్టు,ఎంపిపి భర్త లుముంబా,మండల కన్వినర్ కప్పట్రాళ్ల మల్లికార్జున,గ్రామ సర్పంచ్ షేక్ గఫూర్,వైస్ ఎంపిపి అశోక్,ఎంపిడిఓ గౌరిదేవి,ఏఓ సురేష్‌బాబు,ఎస్ఐ భూపాలుడు,ఎంపిటిసి రాముడు,వైసిపి నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నిజాల్ రెడ్డి, వెలమకూరు రామచంద్ర, మదన్ మోహన్‌రెడ్డి, చంద్రన్న, రామాంజనేయులు, ఆనంద్, సురేంద్ర,భాస్కర్, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## టిబి డ్యాంలో పెరిగిన నీటి మట్టం..



**హాలహర్వి,జూలై 26,ప్రభాతవార్త** ఆంధ్రాకు తాగు,సాగునీరు అందించే తుంగభద్ర డ్యాంకు రోజురోజుకు నీటిమట్టం పెరుగుతుంది. కర్ణాటకలోని శివమొగ్గలో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర డ్యాంకు భారీగా వరదనీరు వస్తున్నాయి. దీంతో డ్యాం వరదనీటితో నిండుకుండలా కళకళలాడుతుంది. కర్ణాటక శివమొగ్గలో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర జలాశయానికి భారీగా వరదనీరు వస్తున్నాయని ఎల్ఎల్‌సి ఏఈ గోపిచంద్ తెలిపారు. డ్యాంకు 1లక్ష12వేల171 క్యుసెక్కుల వరదనీరు వస్తుందని తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 44.19టిఎంసిల నీరు నిల్వ ఉందన్నారు. గురు,శుక్రవారంలోగా డ్యాంకు 50టిఎంసిల నీరు వచ్చే అవకాశం ఉందని ఆయన తెలిపారు. త్వరలో హోల్డ్ మీటింగ్ సమావేశం అనంతరం ఎల్ఎల్‌సి దిగువ కాలువకు నీరు విడుదల చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

## అధిక వర్షాలతో విరిగిన కొండ చరియాలు.




**: నల్లమల ఘాట్ రోడ్ లో... ప్రయాణం ముందుకు సాగేనా..**

**: బుధవారం తెల్లవారుజామున నరక యాతన అనుభవించిన ప్రయాణికులు.**

**: ఎస్సై వెంకటనారాయణ రెడ్డి చొరవతో ట్రాఫిక్ జామ్ కు చర్యలు.**

**: ప్రయాణికులకు పొంచి ఉన్న భారీ ప్రమాదం.**

**ఆత్మకూరు జులై 26 ప్రభాతవార్త.** కర్నూలు గుంటూరు జాతీయ రహదారిపై ప్రయాణికులకు పొంచి ఉన్న భారీ ప్రమాదం ఒకవైపు అధిక వర్షాలు పడటంతో రహదారులని జలమయంగా మారిపోతున్నాయి మరోవైపు నల్లమల ఘాట్ రోడ్ లో ప్రయాణించాలంటే మరో ప్రమాదం ప్రయాణికులకు వాహనదారులకు పొంచి ఉందని చెప్పవచ్చు. బుధవారం తెల్లవారుజామున మూడున్నర గంటల సమయంలో కొండ చరియాలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడటంతో దాదాపుగా మూడు గంటలపాటు భారీ స్థాయిలో కర్నూలు గుంటూరు జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్ భారీ స్థాయిలో నిలిచిపోయింది. రోళ్లపెంట ఘాట్ రోడ్లో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఓ లారీ డ్రైవర్ ఆత్మకూరు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే పోలీస్ సిబ్బందితో కలిసి ఎస్సై వెంకట్ నారాయణ రెడ్డి అక్కడికి వెళ్లి జెసిపి సహాయంతో దాదాపుగా మూడు గంటల పాటు వర్షంలోనే శ్రమించి ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను గుర్తు చేసుకుంటూ వెంటనే కొండ చరియాలు తొలగించే పనులను చేపట్టారు. ఘాట్ రోడ్లో ప్రయాణికులకు వాహనదారులకు ఎలాంటి కమ్యూనికేషన్ లేకపోవడంతో అడవి మార్గంలో జరిగే ప్రయాణం ఏ క్షణమైన ప్రాణాలకే ప్రమాదకరంగా పొంచి ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. గత పది రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు నల్లమల ఘాట్ రోడ్లో కొండ చరియాలు విరిగి రోడ్డు గడ్డంగా పడటంతో ప్రయాణికుల గమ్యస్థానం భద్రమేనా అని పలువురు ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ ఘాట్ రోడ్ లోనే శ్రీశైలం పుణ్యక్షేత్రం విజయవాడ మార్కాపురం ఒంగోలు మరియు విశాఖపట్నం ఎన్నో మహానగరాలకు ఈ ఘాట్ రోడ్ లోనే ప్రయాణం కొనసాగించవలసి ఉంటుంది. ఏది ఏమైనప్పటికీ వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు అటవీ శాఖ అధికారులు ఆర్టీసీ అధికారులు పోలీస్ అధికారులు అందరూ కలిసి సమన్వయంగా పనిచేస్తే ప్రయాణికుల ప్రాణాలు కాపాడుకునే వారమవుతామని వాహన డ్రైవర్లు ప్రయాణికులు అధికారులకు తెలియజేస్తున్నారు.

## లారీ అల్విన్ ఢీ.. ఒకరు మృతి

**ఆళ్లగడ్డ, జూలై 26, ప్రభాతవార్త:** 44వ జాతీయ రహదారి నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణ భూమా శోభాఘాట్ దగ్గర జాతీయ రహదారిపై బుధవారం ఉదయం లారీ అల్విన్ ఢీకొన్నాయి. ఈప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా మరోకరు తీవ్రంగా గాయపడ్డారు. ఆళ్లగడ్డ పట్టణ ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు సడన్‌గా హైవే పైకి వచ్చిన ఓ లారీని హైదరాబాద్ నుండి కడపకు వెళ్తున్న అల్విన్ వాహనం ఢీకొందన్నారు. ప్రమాదంలో అల్విన్ డ్రైవర్ పెద్ద అంకాలు అక్కడికక్కడే మృతిచెందారు. మరో డ్రైవర్‌కు గాయాలు కాగ ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.



## భారీ వర్షాలకు నీట మునిగిన మొక్కజొన్న పంట

**కొత్తపల్లి,జూలై 26,ప్రభాతవార్త:** వరుసగా గత కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ముసలిమడుగు, ఎదురుపాడు, కొక్కెరంచ, ఎర్రమఠం , నందికుంట గ్రామాల్లో మొక్కజొన్న, పత్తి, సోయా చిక్కుడు పంటలు నీట మునిగాయి. అన్నదాతకు ఎటు చూసిన నష్టమే తప్ప వర్షాలతో లాభం లేకుండా పోయింది. బుధవారం కురిసిన భారీ వర్షానికి పంట పొలాలు నీటితో నిండిపోయాయి. ఇలాగే రెండు రోజులు వర్షం కురిస్తే కరువు మండలముగా ప్రకటించ వలసిన పరిస్థితులు నెలకొన్నాయని రైతులు అంటున్నారు.



## భారీవర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండండి

**- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూరం ఏర్పాటు.. ఫోన్‌నం.08514-294898**

**నంద్యాల, జూలై 26, ప్రభాతవార్త:** బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా తుఫాన్ ప్రభావం నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తున్న ఒదున ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికారులందరు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ అధికారులను అదేశించారు. బుధవారం అధికారులతో విసి కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారీ వర్షాల వల్ల జిల్లాను రెడ్ అలర్ట్‌గా ప్రకటించిన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు అందుబాటులో ఉండి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇరిగేషన్, మున్సిపల్ కమిషనర్లు, పంచాయితీరాజ్, అర్



అండ్‌బి, వ్యవసాయ అధికారులు, ఆర్డీఓలు, తహశీల్దార్‌లు ఎంపిడిఓలు తదితర మండలస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, వంకలు నదులకు గండ్లు పడకుండా పరివాహక ప్రాంతాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు తక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టరు అదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సంబం ధిత మండల తహశీల్దార్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ లోని కంట్రోల్‌రూం నం.08514 -294898కు ఫోన్‌చేయాలని జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూరం ఏర్పాటు చేశామని తెలిపారు. కంట్రోల్ రూం ఈనెల 28వరకు 24 గంటట పాటు నిరంతరాయంగా పనిచేస్తుందని కలెక్టరు తెలిపారు.

# మిస్సయిన మహిళల్లో చాలా మందిని ట్రేస్ చేశాం

(మొదటి పేజీ తరువాయి ) : ఉమ్మడి జిల్లాలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని, గత 3 సంవత్సరాలతో పోలిస్తే 6 నెలల కాలంలో నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామని, కర్నూలు, నంద్యాల జిల్లాలో గత 6 నెలల కాలంలో క్రైమ్ ఏవిధంగా ఉందో పరిశీలించామన్నారు. గత 3 సంవత్స రాలతో పోల్చి చూశామన్నారు. గణనీయంగా నేరాలు తగ్గాయన్నారు. బాడీలీ ఆఫెన్స్, మర్డర్, డౌరీ డెత్, హత్యప్రయత్నాలు మొదలగు గ్రేవ్ క్రైమ్ కర్నూలు జిల్లాలో 27శాతం తగ్గాయన్నారు. బాడీలీ ఆఫెన్స్ నంద్యాల జిల్లాలో 25 శాతం తగ్గాయ న్నారు. మహిళలపై నేరాలు కర్నూలు జిల్లాలో 46 శాతం, నంద్యాల జిల్లాలో 65 శాతం తగ్గాయన్నారు. రోడ్డు ప్రమాదాలు కర్నూలు జిల్లా లో 39 శాతం , నంద్యాలలో 36 శాతం తగ్గాయ న్నారు. ఎస్సీ ఎస్టీ నేరాలలో 27శాతం తగ్గాయన్నారు.

దిశా యాప్ తో ముఖ్యంగా మహిళల పై నేరాలు చాలా వరకు తగ్గాయన్నారు. దిశా యాప్ కు ఫిర్యాదులు బాగా వస్తున్నాయన్నారు. వాటిని పరిష్కరించడం తో నేరాల తగ్గుదల కనిపించిందన్నారు. గత సంవత్సరంలో రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ ఏర్పాటు చేశామన్నారు. దానితో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. మేజర్ గ్రేవ్ కేసులలో 120 కేసులకు గాను, 100 కేసులలో ఫలితాలు వచ్చాయన్నారు. డెత్ పెనాల్టీ మరియు, 30 ఏళ్ళ నుండి 40 ఏళ్ళ వరకు కూడా జైలు శిక్షలు విధించడం జరిగిందన్నారు. క్రైమ్ తగ్గడంతో పాటు, కంట్రోల్ లో ఉందన్నారు. రౌడీ మూకల పై గట్టి నిఘా ఉంచామన్నారు. పోలీసు యంత్రాంగం అన్ని విధాల చర్యలు తీసుకుంటుందన్నారు. గత సంవత్సరం లో రౌడీ మూకలపై, అక్రమ మద్యం రవాణా చేసే గ్యాంగ్ ల పై పీడీ యాక్టు క్రింద 35 మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా పిడి యాక్టులు సిద్ధం చేశామన్నారు. గత సంవత్సరాలలో పోలీసులు చేసిన పని విధానాన్ని అందరికి వర్తింపజేసామన్నారు. డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలు ఆయా పోలీసు స్టేషన్ లలోని ప్రాధాన్యత గల కేసులలో ప్రతి పోలీసు అధికారికి 10 కేసుల చొప్పున కేటాయించి అన్ని కేసులు పరిష్కరిస్తున్నామన్నారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా 13 వేల కేసులు అందజేస్తే 1400 కేసులు ట్రయల్ పూర్తయి 62 శాతం రికార్డు స్థాయిలో కన్విక్షన్ వచ్చిందన్నారు. ఎస్సైలకు పదోన్నతులు రావడం లేదని వినతి పత్రం అందజేశారన్నారు. సానుకూలంగా పరిశీలించామ న్నారు. పోలీసుశాఖలోని ఎస్సైలకు సిఐలుగా పదోన్నతులు కల్పిస్తున్నామన్నారు. సూపర్ న్యూమరి డిఎస్పీలను రెగ్యూలర్ డిఎస్పీలుగా పదోన్నతులు కల్పించామన్నారు. ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం మిస్సింగ్ కేసులలో 26 వేల మందిలో 23,300 మంది ట్రేస్ అయి ఇళ్ళకు చేరుకున్నారన్నారు. ట్రేస్ అయ్యే కొద్ది కేసులు పూర్తిగా తగ్గుతూ వస్తాయన్నారు.

## ఆదోని అభివృద్ధికి చర్యలు - కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి ) : మరియు టూరిజం అధికారులు కలిసి ఎంఓయు లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ టూరిజం అధికారులను ఆదేశించారు. ఆడా పరిధిలో ఉన్న ఉపాధ్యాయుల ఖాళీలు ఎన్ని ఉన్నాయని వెరిపై చేసి నివేదిక ఇవ్వాలని డీఈవో ను ఆదేశించారు.. ప్రతివారం ఒకసారి ఆడా సమావేశాన్ని సబ్ కలెక్టర్ లెవెల్ లో చేసుకోవాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి కలెక్టర్ ఆధ్వర్యంలో ఆడా సమావేశము జరిగేటట్లు చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కు సూచించారు. జూమ్ కాన్ఫరెన్స్ లో సిపిఓ అప్పలకొండ డిఆర్డిఏ పి డి నాగ శివ లీల, ఇరిగేషన్ ఎస్ ఈ , ఆర్ అండ్ బి ఎస్ ఈ తదితర అధికారులు పాల్గొన్నారు.

## అందరు సహకరించండి అభివృద్ధి పథంలో దూసుకెళ్దాం

– ఎంపిపి బుగ్గన

బేతంచెర్ల, జూలై26, ప్రభాతవార్త: మండల అభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా అందరు సహకరించండి రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పథంలో దూసుకెళ్దామని మండల అధ్య క్షులు బుగ్గన నాగభూషణంరెడ్డి కోరారు. బుధవారం ఆయన అధ్య క్షతన ఎంపిడివో కార్యాలయం నందు సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో ఆయా శాఖలు చేపట్టిన



అభివృద్ధి పనులను వివరించడం జరిగింది. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అవసరమైన పనులకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు తెలియజేయడం జరిగింది. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు వారి వారి పరిధిలో ఉన్నటువంటి సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురావడం జరిగింది. అందరు సహకరిస్తే అన్ని సమస్యలను పరిష్కరించుకుంటూ అభివృద్ధి పథంలో దూసుకెళ్దామని ఎంపిపి కోరారు. ఈ సమావేశంలో ప్రత్యేక అధికారిణి వసంత లక్ష్మి, ఎంపిడివో వెంగన్న, తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, మండలస్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర ్పంచ్‌లు పాల్గొన్నారు.

## ఆటో యూనియన్ కార్యదర్శికి బ్రైన్ స్ట్రోక్

– ఆదుకున్న ఆటో యూనియన్

బేతంచెర్ల, జూలై26, ప్రభాతవార్త: పట్టణంలోని సీఐటీయు అనుబంధ సంస్థ అయిన ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శిగా పనిచేస్తున్న నూరుల్లా ఖాద్రీ బ్రైన్ స్ట్రోక్‌కు గురికావడంతో యూనియన్ ప్రతినిధులు ఆర్థిక సహాయం అందజేసి ఆదుకున్నారు. ఇటీవల నూరుల్లా ఖాద్రీ అకస్మాత్తుగా బ్రైన్‌స్ట్రోక్‌కు గురై నిస్సహాయ స్థితిలో ఉండిపోయాడు. దీంతో ఆటో యూనియన్ అధ్యక్షుడు ఏ.మద్దిలేటిస్వామి, సీఐటీయు జిల్లా నాయకులు యల్లయ్య, వై.బి.వెంకటేశ్వర్లు, యూనియన్ సభ్యుల సహకారంతో రూ.21,500ల ఆర్థిక సహాయాన్ని నూరుల్లాఖాద్రీకి బుధవారం అందజేయడం జరిగింది. ఇటీవలే నూరుల్లాఖాద్రీ భార ్య చనిపోవడంతో ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెతో కుటుంబం తీవ్ర ఇబ్బందులకు గురైందని గుర్తించి తమ వంతు బాధ్యతగా ఈ సహాయాన్ని అందించినట్లు ఆటో వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఆటో వర్కర్స్ యూనియన్‌కు నూరుల్లాఖాద్రీ చేసిన సేవలు వెలకట్టలేనివని వారన్నారు. తీవ్ర ఇబ్బందులకు గురైన నూరుల్లా ఖాద్రీతోపాటు అతన్ని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## పోలీసుల సమక్షంలో అనాథ మహిళకు అంత్యక్రియలు

ఆదోనిటౌన్, జూలై26, ప్రభాతవార్త ; పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన వెలిసిన శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయం వద్ద గుర్తు తెలియని అనాథ మహిళ బుధవారం మృతిచెందింది. ఆలయ దగ్గర బిచ్చం ఎత్తుకుంటున్న అనాథ మహిళ మృతిచెందిందని సమాచారం తెలుసుకున్న టూటౌన్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు.

## భారీ వర్షాల కారణంగా నాలుగు రోజులు అన్ని పాఠశాలలకు సెలవులు

నంద్యాల విద్య, జూలై 26, ప్రభాతవార్త: జిల్లాలో భారీవర్షాలను దృష్టిలోపెట్టుకొని నంద్యాల జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలకు, నాలుగు రోజులు సెలవులు ప్రకటించమని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ ఇచ్చిన అదేశాల మేరకు నేటి నుంచి 30వ తేది వరకు సెలవులు ప్రకటిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి కె సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ప్రకటించిన సెలవుదినంకు బదులుగా ఆగష్టు రెండవ శనివారం పాఠశాల నిర్వహించాలని అన్ని పాఠశాలల యజమాన్యాలకు, ప్రధానోపాధ్యాయులకు అదేశించారు. 28న అప్సన్‌సెలవుగాను, 29న మొహర్రం సెలవుగా, 30న ఆదివారం సెలవుగాను ప్రకటించడమైంది. ఈసెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహించిన యెడల వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఇఓ తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు వర్షం కారణంగా సెలవు ప్రకటించాలని యాజమాన్యాలకు సూచించారు. నాడు నేడుకు సంబంధించిన సిమెంటు, ఇతర వస్తువులు, వర్షానికి తడవకుండా భద్రపరచాలని సంబంధిత అధికారులకు అదేశించారు

## సచివాలయాన్ని అకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టరు

నంద్యాల, జూలై 26, ప్రభాతవార్త: నంద్యాల జిల్లా గోస్పాడు మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ అకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ పరిధిలో ఉన్న 5 నుంచి 18 సంవత ్సరాల పిల్లల వివరాలు సచివాలయంలో ఉండాలని సూచించారు. సచివాలయంలో ప్రతిరోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించడంతో పాటు సంబంధిత ఫిర్యాదులను రికార్డులో నమోదు చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారికి సేవలు అందించాలని తెలిపారు. రిజిష్టర్‌లను రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో తహాశీల్దార్, ఎంపిడిఓ పాల్గొన్నారు

## ఆగష్టు 15 నుంచి అన్ని గ్రామ పంచాయితీల్లో నగదు రహిత లావాదేవిలు

నంద్యాల, జూలై 26, ప్రభాతవార్త: జిల్లాలోని 489 గ్రామ పంచాయితీల్లో ఆగష్టు 15 నుంచి నగదు రహిత అధారిత చెల్లింపుల ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు జిల్లా పంచాయితీ అధికారి మంజుల వాణి బుధవారం తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు ఆగష్టు 15 నుంచి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీల్లో మొబైల్ ద్వారా క్యూఆర్‌కోడ్‌తో నగదు చెల్లించే ప్రక్రియ ప్రారంభం కానుందన్నారు. గ్రామ పంచాయితీల్లో ప్రజల నుంచి వసూలుచేయు పన్నులు, చెల్లింపులు నగద రహిత అధారిత ప్రక్రియ ద్వారా స్వీకరించడం, చెల్లింపులు చేయడం జరుగుతుందన్నారు. ప్రజల సౌకర్యార్థం ఈప్రక్రియను ఏర్పాటు చేశామని ప్రజలందరు సహకరించాలని ఆమె పేర్కొన్నారు.

## పాఠశాల విద్యార్థులను ఆన్‌లైన్ ఇన్‌ఫోలో నమోదు చేయాలి

పత్తికొండ, జూలై 26, ప్రభాతవార్త : పాఠశాలకు వెళ్లే విద్యార్థులను ఆన్‌లైన్ ఇన్‌ఫోలో కచ్చితంగా నమోదు చేయాలని ఎంపిడిఓ కవిత ఎంఈఓ-1,2 రమేష్, మస్తాన్‌వలి, పాఠశాల హెచ్‌ఎంలు, కళాశాలల ప్రిన్సిపల్‌లను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం నందు 100శాతం జిఈఆర్ పొందుట కొరకు పాఠశాలల హెచ్‌ఎంలు, కళాశాల ప్రిన్సిపల్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ 338మంది వాలంటరీలు 14390మంది విద్యార్థులను సర్వే చేశారని ఈ సర్వే నందు చైల్డ్ ఇన్‌ఫోలో నమోదు చేసుకున్న విద్యార్థులు 10875మంది ఉండగా మిగిలిన 2635మంది విద్యార్థులు వివిధ కారణాల వల్ల చైల్డ్ ఇన్‌ఫోలో నమోదు చేయలేకపోయారన్నారు. వెంటనే వీరు ఏ పాఠశాల, కళాశాలలో చదువుతున్నారో వెంటనే చైల్డ్ ఇన్‌ఫోలో నమోదు చేసి 100శాతం జిఈఆర్ సాధించాలని ఆదేశించారు.

## ఎస్‌టి రిజర్వేషన్ బిల్లు అంశం పార్లమెంట్‌లో మాట్లాడిన ఎంపికి కృతజ్ఞతలు

దేవనకొండ, జూలై 26, ప్రభాతవార్త : వాల్మీకి బోయల ఎస్‌టి రిజర్వేషన్ బిల్లు అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడిన ఎంపి విజయసాయిరెడ్డికి వీఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కప్పట్రాళ్ల మల్లికార్జున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కప్పట్రాళ్ల మల్లికార్జున మాట్లాడుతూ వీఆర్‌పిఎస్ రాష్ట్ర నేతల బృందం ఢిల్లీ వెళ్లి వాల్మీకి బోయల ఎస్‌టి రిజర్వేషన్ అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడాలని వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డి మిగతా ఎంపిలను కలిసి విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. దాని ఫలితంగా రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి పార్లమెంట్‌లో వాల్మీకి బోయల పక్షాన మాట్లాడినందుకు వారికి వాల్మీకి బోయల తరుపున హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి నాయకులు రవికుమార్, మహాలింగడు, మునిస్వామి, ఎర్రమల, తిప్పన్న, లింగన్న, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలి అయిన డాక్టర్లకు ఘన సన్మానం

నందికొట్కూరు, జూలై 26, ప్రభాతవార్త: పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవలే సాధారణ బదిలీలో భాగంగా బదిలి అయిన మెడికల్ ఆఫీసర్ డాక్టర్.రాయుడు, డాక్టర్.ప్రసాద్, ల్యాబ్ టెక్నిషియన్ మరియు ఎన్జీఓ సంఘం కార్యదర్శి సత్యనారాయణ, విజి నరేష్‌ను సూపరిన్‌డెంట్ డా.రాంబాబు ఆధ్వర్యంలో దుశ్శాలువ కప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. బుధవారం స్థానిక వైద్యశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనవనంది హైస్కూల్ అధినేత శ్రీధర్, జవ్వాజి సుంకన్నగౌడ్ సేవా సమితి అధ్యక్షులు శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతు గత ఏడు సంవత్సరాలుగా డా.రాయుడు ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని కరోనా సమయంలో ఆయన బృందం అంధించిన సేవలను వారు కొనియాడారు. అలాగే డాక్టర్.ప్రసాద్, టెక్నిషియన్ సత్యనారాయణ అందరి మన్ననలు పొందారన్నారు. డా.రాయుడు ఆత్మకూరు, డా.సత్యనారాయణ డోన్ ఏరియా హాస్పటల్, ల్యాబ్‌టెక్నిషియన్ సత్యనారాయణ మిడుతూరు, విజి నరేష్ డోన్‌కు బదిలి అయ్యారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వనములపాడు మోహరం వేడుకల్లోపాల్గొన్న వైఎస్‌ఆర్‌సిపి నాయకులు

పగిడ్యాల, జూలై 26, ప్రభాతవార్త : పగిడ్యాల మండలం వనములపాడు గ్రామంలో బుధవారం మోహరం పండుగ సందర్భంగా దర్గా వద్ద మాజీ మంత్రి బైరెడ్డి శేషశయనారెడ్డి కుమారుడు డాక్టర్ బైరెడ్డి డాక్టర్ బైరెడ్డి మల్లికార్జునరెడ్డి ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మెన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లా వైఎస్‌ఆర్‌సిపి యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ మండ్లెం మధుసూధనరెడ్డి, పాత ముచ్చుమర్రి గ్రామసర్పంచ్ అంజనేయులు, కొత్త ముచ్చుమర్రి మాజీ సర్పంచ్ బోయ మద్దిలేటి, నాగశేనారెడ్డి, శ్రీనువాసులురెడ్డి, మహేష్ గ్రామప్రజలు పాల్గొన్నారు.

## వృధా అయిన ప్రభుత్వ నిధులు

– తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి

మంత్రాలయం, జూలై 26, ప్రభాతవార్త: నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలో సుమారు రూ.4 కోట్ల ప్రభుత్వ నిధులువృధా అయ్యాయని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వర్షపు నీరు లీకేజీకావడంతో సమాచారం తెలుసుకున్న ఆయన పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల గదుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా నిర్మించడంతో పాఠశాల గదుల్లో నీరు లీకేజీ అవుతున్నట్లు తెలిపారు. పాఠశాలలో సుమారు 1100 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల గదులు బీటలు వారి వర్షపు నీరు పాఠశాలలోకి వస్తున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా కొన్ని తరగతుల విధ్యార్థులకు బెంచ్ సౌకర్యం లేనట్లు గ్రహించారు. పాఠశాల మైదానం బురదమయం కావడంతో విధ్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు స్పష్టంచేశారు. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయరామిరెడ్డి, పన్నగనాగసేన, శంకర్‌నాయక్, చిదానంద తదితరులు పాల్గొన్నారు.

## ఏపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన ఎం అమానుల్లా

హొళగుంద, జూలై 26, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీ కర్నూలు జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం అమానుల్లా కాంగ్రెస్ పార్టీ ఏపిసిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలిని బుధవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిసి ఆలూరు నియోజకవర్గ సమస్యలను తెలియజేశారు. ఇందుకు స్పందించిన కాంగ్రెస్ పార్టీ ఏపిసిసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకుంటే నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కారం అవుతాయన్నారు. అలాగే రాబోయే ఎన్నికల్లో కాబోయే ప్రధాని రాహుల్‌గాంధీ అని అన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్రం, కేంద్రంలో 2024ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పనిచేసి కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశ, రాష్ట్ర అభివృద్ది సాధ్యమవుతుందన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

హాలహర్వి, జూలై 26, ప్రభాతవార్త : సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని స్పెషల్ ఆఫీసర్ రామాంజనేయులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని గూళ్యం సచివాలయాలను పరిశీలించారు. సచివాలయంలో మూవ్‌మెంట్ రిజిస్టర్, హాజరు పట్టిక తదితర రికార్డులను పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరుపేదలకు సకాలంలో అందించాలన్న లక్ష్యంతోనే సచివాలయాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కావున సచివాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండి అర్హులైన లబ్దిదారులందరికి సకాలంలో సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. అలాగే సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలపైన అవగాహన కల్పించాలని సూచించారు. జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలను వేగవంతం అయ్యేలా లబ్దిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పూర్తయిన గృహ నిర్మాణాలకు వెంటనే బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించారు. ఈయన వెంట ఎంపిడిఓ ఆంటోని, తహశీల్దార్ మల్లికార్జున, వెల్ఫేర్ అసిస్టెంట్ సుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, విఆర్‌ఓలు రాఘవేంద్ర స్వామి, నాగేష్ తదితరులు వున్నారు.

## నాడు నేడు కింద అదనపు గదులు నిర్మించాలి

నందికొట్కూరు, జూలై 26, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని అందులో భాగంగానే నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలల మరమ్మత్తులు, మౌళిక సదుపాయాలు కల్పిస్తున్న సంభంధిత అధికారులు పాఠశాలలో అదనపు గదులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని యం.పి.పి.మురళీకృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం యం.పి.పి. అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా యం.పి.పి. మాట్లాడుతు కోనేటమ్మపల్లి గ్రామంలో విద్యార్థులు కూర్చోనేందుకు గదులు లేవని అయితే నాడు-నేడు ఇంజనీరింగ్ అధికారులు కాంపౌండు, టాయిలెట్స్, ఇతర సదుపాయాలు ఉన్న తిరిగి వాటినే ఏర్పాటు చేసేందుకు నిధులు ఇచ్చారని, అదనపు గదులు కట్టమంటే పట్టించుకోవడం లేదని, అవసరమైన పనులు చేపట్టాలన్నారు. ఈ సమస్య పలుగ్రామాలలో ఉన్నదని సభ్యులకు ఏ.ఇ. జవాబు ఇవ్వాలన్నారు. దీంతో ఏఇ సరి అయిన సమాధానం ఇవ్వక పోవడంతో సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలి సమావేశానికి విధ్యుత్ ఏ.ఇ.రాకపోవడంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలలో విధ్యుత్ స్థంభాలు ఏర్పాటు చేసి వాటికి కనెక్షన్ ఇవ్వడంలేదని దీంతో కొంత మంది స్థంభాలను తీసుకెళ్ళి వ్యవసాయ విధ్యుత్‌కు వాడుతున్నారని శాతనకోట సర్పంచ్ జనార్ధన్‌గౌడ్, బిజినవేముల సర్పంచ్ రవియాదవ్, వడ్డెమాన్ సర్పంచ్ రామచంద్రుడు ఆరోపించారు. దీంతో స్పంధించిన యం.పి.పి. నెలనెల ఎం.పి.పి. జడ్పీటిసి సభ్యులతో విధ్యుత్ సబ్ స్టేషన్ల వద్ద సమావేశం నిర్వహించాలని ఉత్తర్వులు ఉన్న విధ్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు. అనంతరం పలువురు సభ్యులు సమస్యలు తెలుపగా వాటిని పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటామని యం.పి.పి.తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాక్షురాలు జ్యోతి, యం.పి.డి.ఓ.శోభారాణి, తహాసిల్దార్ రాజశేఖర్‌బాబు, యం.ఇ.ఓ.ఫైజున్నిషాబేగం, వ్యవసాయశాఖ ఏఓ షేక్షావలి, సి.డి.పి.ఓ. కోటేశ్వరి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, జడ్పీటిసి, ఎం.పి.టి.సి.లు పాల్గొన్నారు.

## మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

పత్తికొండ, జూలై 26, ప్రభాతవార్త : పట్టణంలోని చక్రాల రోడ్డులో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఉమాకుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపిసి గ్రూపు నందు ఎస్‌సి, ఎస్‌టి, ఓసి క్యాటగిరిలో మిగిలిన సీట్లకు ఈ నెల 27వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మెరిట్ ఆధారంగా 28వ తేదీన ఎంపిక చేయబడుతుందన్నారు. దరఖాస్తు చేసేటప్పుడు టిసి, ఎస్‌ఎస్‌సి మార్క్స్ మెమో, కుల దృవీకరణ, ఆధార్‌లు జతపరచాలని తెలిపారు.

## 'మొహరం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి'

కొలిమిగుండ్ల, జులై 26, ప్రభాతవార్త : మండలంలోని వివిధ గ్రామాల్లో మొహరం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని కొలిమిగుండ్ల ఎస్ఐ రమేష్‌రెడ్డి పెర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మొహరం వేడుకల్లో పీర్ల చావిడిల వద్ద నిర్వాహకులు నిభంధనలు తప్పక పాటించాలని సూచించారు. ముస్లింలతో పాటు హిందువులు కలిసి మెలిసి జరుపుకునే పీర్ల స్వాముల వేడుకల్లో ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించుకోవాలని ఎస్ఐ రమేష్‌రెడ్డి పెర్కొన్నారు. ఈ సందర్భంగా అయా గ్రామాల్లో పర్యటించి, పీర్ల స్వాములు కొలుదీరిన చావిడి ప్రాంతాలను పరిశీలించారు. కాగా మండలంలోని మీర్జాపురం, బందార్లపల్లె, గొర్విమానుపల్లె, పెట్నికోట, బెలుం తిమ్మనాయినిపేట తదితర గ్రామాల్లో మొహరం వేడుకల్లో భాగంగా చిన్న సరిగేత్తు, మధ్య సరిగెత్తు, పెద్ద సరిగెత్తు వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## నేను దళితుడైనందుకు నన్ను పరామర్శించారా...

మిడుతూరు, జూలై26, ప్రభాతవార్త ; ఏదైనా గొడవ జరిగి సచివాలయ ఆస్తులు ధ్వంసమై నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగి దళితుడికి అవమానం జరిగితే కనీసం ఎవరూ పరామర్శించరా అంటూ తలముడిపి గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు వాపోయారు. మండల అభివృద్ధి కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. మండలంలోని తలముడిపి గ్రామంలో సచివాలయ పరిధిలో ఇటీవల గొడవ జరిగిందని, ఆ సందర్భంగా సచివాలయ ఆస్తులు దెబ్బతిన్నాయని నన్ను అవమానపరిచే చర్యలు జరిగాయనీ సర్పంచ్ అన్నారు. అయితే అధికారులు గానీ, ప్రజాప్రతినిధులు గానీ విషయంపై ఎవరూ నా వద్ద చర్చించలేదని, కనీసం నన్ను ఎవరూ పరామర్శించలేదన్నారు. దీంతో ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, సింగిల్‌విండో చైర్మన్ తమ్మిదల నాగతులసిరెడ్డిలు జోక్యం చేసుకుంటూ ఎవరో నిన్ను అవమానపరచలేదని, నీ తరపున ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో పాటు మేమంతా వెంటనే స్పందించామన్నారు. నిజాలు తెలుసుకోకుండా అలా మాట్లాడడ ం పద్ధతి కాదంటూ వారన్నారు. అంటే సమావేశంలో నా బాధను వ్యక్తం చేసే హక్కు కూడా నాకు లేదా అంటూ సర్పంచ్ చెప్పగా, ఇక్కడ సమావేశంలో హక్కుల గురించి కాదు చర్చ దళితులను అవమానపరచడంలేదని, నిన్ను ఎవరూ కించపరచలేదని నీకోసం మేమంతా స్పందించామన్నారు. నా బాధ మీకు తెలియదు తీవ్రస్థాయిలో నాకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని మీరంతా నాకు మద్దతు తెలపాల్సిన అవసరం ఉందని, ఎందుకంటే నా స్వప్రయోజనాల కోసం నేను సమస్యలపై పోరాడడంలేదని గ్రామం కోసం పోరాడుతున్నానని సర్పంచ్ వెంకటేశ్వర్లు అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప మండలాధ్యక్షుడు తుపాకుల నభిరసూల్, తహసీల్దార్ ప్రకాష్‌బాబు, ఈఓపీఆర్డఈ ఫక్రుద్దీన్, ఏఓ పీరునాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్ష పేద ప్రజలకు అండ..

కౌతాళం, జూలై26, ప్రభాతవార్త ; జగనన్న సురక్ష పేద ప్రజలకు అండ అని వైఎస్సార్సీపీ మండల నాయకులు దేశాయ్ ప్రహ్లాద్ ఆచారి, ఎంపీడీఓ సుబ్బరాజు అన్నారు. ఈ మేరకు బుధవారం కౌతాళంలోని సచివాలయం-03లో లబ్ధిదారులకు జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా కుల, ఆదాయ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రైస్ కార్డులు, జనన, ఫ్యామిలీ సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా మండల నాయకులు దేశాయ్ ప్రహ్లాద ఆచారి మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్క లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలకు అర్హులై ఉండి రాని వారు జగనన్న సురక్ష ద్వారా దరఖాస్తు చేసుకుంటే పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారని, ఈ కార్యక్రమం ద్వారా ఎందరో పేదలు లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. వైఎస్సార్సీపీ నాయకులు, ఎంపీపీ అమ్రేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, కో-ఆప్షన్ మెంబర్ మహబూబ్, ఎంపీడీఓ సుబ్బరాజు, తహసీల్దార్ రమేష్‌రెడ్డి, ఆర్ఐ రాజశేఖర్, సర్పంచ్ పాల్‌దినకర్, వజీఈ ఎంపీటీసీ చౌదరిబసవ, ఉప సర్పంచ్ తిక్కయ్య, రామన్నగౌడ్, స్కూల్ చైర్మన్ వడ్డే రామన్న, మాజీ సర్పంచ్ అవతారం, భీమేష , సమద్, అనిలకుఉమార్, వీరేష , లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల నమోదు పై అన్ని పార్టీలతో సమావేశం

చాగలమర్రి, జూలై26, ప్రభాతవార్త: మండల కేంద్రమైన చాగలమర్రిలోని మండల ప్రజా పరిషత్ సమావేశహాల్‌లో ఓట్ల నమోదు పై అన్ని రాజకీయ పార్టీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీతోపాటు కాంగ్రెస్ పార్టీ, వైఎస్సార్ కాం గ్రెస్ పార్టీ, జనసేన పార్టీతోపాటు ఇతర ప్రాంతీయ పార్టీ సభ్యులు సమావేశానికి హాజరై ఓట్ల నమోదు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నమోదు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వీరభద్రుడు, కాంగ్రెస్ పార్టీ నుంచి మహబూబ్ బాషా(మాబాషా), తెలుగుదేశం పార్టీ నుంచి ముల్లా అజీమొద్దీన్, తదితర పార్టీల నుంచి నాయకులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయుడికి ఘనసన్మానం

బనగానపల్లె, జూలై26, ప్రభాతవార్త: పట్టణంలోని స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో బి.రామకృష్ణ అనే ఉపాధ్యాయుడి ప్రధానోపాధ్యాయుడిగా పదోన్నతి పొంది బనగానపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రావడం చాలా సంతోషకరమని మరియు అలాగే ప్యాపిలి మండలం విద్యాశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించడం ఆయన నిజాయితీకి, పనితనానికి నిదర్శనమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్య క్షులు బి.మాధవస్వామి, జిల్లా సహాఅధ్యక్షులు ఎం.మధుసూదన్‌రావులు కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బి.రామకృష్ణ ప్రధానోపాధ్యాయుడిగా, మండల విద్యాశాఖ అధికారిగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అనేక సేవలు అందించి మంచి ఉన్నతమైన స్థానాన్ని పొందాలని కోరారు. అనంతరం రామకృష్ణను ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో మండల అధ్యక్షులు కె.వెంకటకృష్ణుడు, రాష్ట్ర కౌన్సిలర్ వి.సుబ్బరాయుడు, రామకృష్ణ, నాయకులు కుమార్ బాబు, కె.రమేష్, ఎస్.చాంద్‌బాషా, పోలియా నాయక్, కె.గోవిందనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి

వెల్దుర్తి, జులై26, ప్రభాతవార్త : వెల్దుర్తి మండలంలో నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్సై చం ద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడకల పేరుతో ఆకతాయిలు మహిళలను వేధిస్తే తమదైన శైలిలో ట్రీట్‌మెంట్ తప్పదని హెచ్చరించారు. బైక్‌లపై త్రిబుల్ రైడింగ్, వింత హారన్ల మోత, అతివేగంగా బైక్‌లు నడుపడం వంటివి చేయరాదన్నారు. పీర్లచావిడుల వద్ద మద్యం సేవించి అల్లర్లకు పాల్పడడం మానుకోవాలన్నారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. కులమతాలకు అతీతంగా చేసుకునే ఈ పండుగ వేడుకలను కలిసిమెలిసి సంతోషంగా చేసుకోవాలని ఎస్సై సూచించారు. ఈ వేడుకలపై ప్రత్యేక పోలీస్ నిఘా ఉంచామన్నారు.

## జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటు క్రిస్టియన్ సెల్ అధ్యక్షనిగా నెహమియ

కర్నూలు న్యూసిటి, జూలై 26, ప్రభాతవార్త: కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ పార్లమెంటు క్రిస్టియన్‌సెల్ అధ్యక్షునిగా నియిమించినందుకు జిల్లా తెలుగుదేశం పార్టీ నాయకులు అధ్యక్షులు బి టి నాయుడు, కోడుమూరు ఇంచార్జీ అకేపోగు ప్రభాకర్, కర్నూలు ఇంచార్జీ టిజీ భరత్‌కు, పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుకు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు, రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు పి నెహమియ పేర్కొన్నారు. అలాగే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పోలిట్‌బ్యూరో సభ్యులు కెఇ కృష్ణమూర్తి, జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డికి జిల్లాలోని వివిధ అసెంబ్లీ ఇంచార్జీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాపై నమ్మకం వుంచి బాధ్యతను అప్పగించి వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీకి నావంతు కృషిచేసి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నా విధులు నిర్వర్తిస్తానని తెలిపారు.

## విద్యుత్ వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

బండిఆత్మకూరు, జూలై 26, ప్రభాతవార్త: గత కొన్ని రోజులుగా ఎడతెరిపిలేని వర్షాల పడడం కారణంగా విద్యుత్ వనియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఏఈ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈసందర ్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల రైతులు విద్యుత్ వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు వర్షాల వల్ల పంట పొలాల్లో విద్యుత్ మోటార్లు నీట మునిగి ఉంటాయని స్టార్టర్ డబ్బాలు తడిచి ఉంటాయని రైతులు వాటిని ముట్టుకునే ప్రయత్నం చేయరాదన్నారు. పొలాల్లో పశువులు మేపే సమయంలో జాగ్రత్తగా ఉండాలని పశువులను విద్యుత్ స్థంబాలకు కట్టరాదని అన్నారు. ఉరుములు, పిడుగులు సంభవించినప్పుడు విద్యుత్ లైన్లకింద ఉండరాదని పొలాల్లో ఇళ్ళమధ్యలో విద్యుత్ తీగలు తెగిపడినా వెంటనే మీ ఏరియా కరెంటు అఫీసుకు, లేదా లైన్‌మెన్‌కు సమాచారం అందించి ప్రమాదాలు నివారించేందుకు సహకరించాలని కోరారు. అప్రమత్తంగా లేకపోతే విద్యుత్‌ఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని విద్యుత్ సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత సిబ్బంది దృష్టికి తేవాలని రైతులను వినియోగదారులను కోరారు. ఇంట్లో ఎలాంటి విద్యుత్ పరికరాలు అరుబయట కరెంటు స్థంబాలను తడిచేత్తో తాకవద్దన్నారు.

## ఓపెన్ స్కూళ్ళలో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభం

నంద్యాల విద్య, జూలై 26, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపిఓఎస్ఎస్) (ఓపెన్ స్కూల్) ద్వారా 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశం కోసం నోటిఫికేషన్ విడుదలైందని విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని డి.ఇ.ఏ. కె.సుధాకర్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డీనేటర్ పి.లక్ష్మినారాయణ సంయుక్త ప్రకటనలో తెలిపారు. దరఖాస్తును ఆన్‌లైన్లో సబ్మిట్ చేసుకోవడానికి జూలై 27 నుంచి ఆగష్టు 31వ తేదీ వరకు గడువు ఉందని వారు తెలిపారు. అర్హతలు పదో తనగతిలో చేరేందుకు వచ్చే ఆగష్టు 31వ తేదీ నాటికి 14 ఏళ్ళు నిండి ఉండాలని ఎలాంటి గరిష్ట వయోపరిమితి ఉండదు. చదవడం, రాయడం తెలిసి ఉండాలి. దరఖాస్తుతో పాటు టీసి, రికార్డు షీటు, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, అలాగే ఇంటర్మీడియెట్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, టెన్త్ టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ, బీసి అభ్యర్థులు కుల దృవీకరణ పత్రం, దివ్యాంగులు దృవీకరణ పత్రాలను అందజేయాలి. ఓపెన్ స్కూల్లో అడ్మిషన్ పొందిన వారికి ఆదివారం, ప్రతి నెల రెండవ శనివారం మరియు సెలవు దినాలలో ఆయా అధ్యయన కేంద్రాల్లో 30 కాంట్రాక్ట తరగతులు ఉంటాయని వారు పేర్కొన్నారు.

## ఊడిపడిన పెచ్చులు

నందికొట్కూరు, జూలై 26, ప్రభాతవార్త: నిత్యం రద్దీగా ఉండే పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి హాఠాత్తుగా పైకప్పు పెచ్చులు ఊడిపడడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది. బుధవారం సాయంత్రం స్టేషన్ రిషిప్షన్ సి.ఐ. గది వద్ద ఆసమయంలో పోలీసులు కాని ఫిర్యాదు చేసేందుకు ఎవరు లేకపోవడంతో ఎలాంటి సంఘటన జరగపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

వెలుగోడు, జూలై 26, ప్రభాతవార్త: మండల సమావేశంలో ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలు, గ్రామ సమస్యలు మండల సమావేశం దృష్టికి తెచ్చిన వాటిని పరిష్కారించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని యం.పి.పి.లాలం రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో యం.పి.పి. అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతు అధికారులు తమ తమ శాఖల పరంగా గత సమావేశంలో తీర్మానించిన సమస్యలు ఎంత వరకు పరిష్కారమయ్యాయని అన్న సమాచారాన్ని ఎం.పి.డి.ఓ. కార్యాలయంలో సమర్పించాలని, అలాగే ప్రస్తుతం వచ్చిన సమస్యలను కూడ సంభంధిత అధికారులు చూడాలన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులకు మెమోలు జారీ చేయాలని యం.పి.పి.సూచించారు. ఈ సమావేశంలో యం.పి.డి.ఓ. అమానుల్లాఖాన్, తహాసిల్దార్, ఎం.పి.టి.సి.లు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బిసి సదస్సును విజయవంతం చేయండి



**కర్నూలు న్యూ సిటీ, జూలై 26, ప్రభాతవార్త:** ఒంగోలులో జరగబోయే జయహో బీసి సదస్సు ను విజయవంతం చేయాలని తెలుగు దేశం పార్టీ బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వై నాగేశ్వర్ యాదవ్ తెలిపారు. బుధవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేస్ అధ్వర్యంలో ఒంగోలులో జరుగుతున్న జయహో బిసి సదస్సు ను విజయవంతం చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ బిసి సాధికార సమితి నాయకులు సమావేశం కావడం జరిగిందన్నారు. ఈసందర్భంగా పార్టీ బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వై నాగేశ్వర్‌యాదవ్, పార్లమెంటు బిసిసెల్ అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు, రాష్ట్ర లింగాయత్ కన్వీనర్ శివరాజు, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు బాబురాజు, తిరుపాల్ బాబు, జయన్న, మహేదేవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరు కావడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి బిసి దాదాపు పదుల సంఖ్యలో మరణించడం జరిగిందని వైసీపీ ప్రభుత్వం బిసిలకు దక్కాల్సిన పదవులను అగ్రవర్ణ కులాలకు కట్టబెట్టడం జరిగిందన్నారు. అన్ని పదవుల్లో బిసిలకు అన్యాయం చేశారన్నారు. ఆయన సలహాదారులు, సలహాలు ఇచ్చేందుకు ఒక బిసి కూడ పనికిరాడ అని సూటిగా ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం బిసిల అభ్యున్నతికని 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఆ కార్పొరేషన్‌లకు ఎలాంటి నిధులు, మంజూరు చేయకుండా కార్పొరేషన్లను నీరుగార్చిందనా న్నరు. జయహో బిసి సదస్సుకు రాయలసీమ జోన్లలో ఉన్న బిసి సాధికార సభ్యులు బిసి నాయకులు అందరు తప్పకుండా హాజరయి సదస్సు ను విజయవంతం చేయాలని కోరారు.

## భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు జరుపుకోవాలి



**హాలహర్వి, జూలై 26, ప్రభాతవార్త:** భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు జరుపుకోవాలని ఆలూరు సిఐ వెంకటేశ్వర్లు, హాలహర్వి ఎస్ఐ నాగేంద్రుడు అన్నారు. బుధవారం కామినహాల్ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొహరం వేడుకల్లో భాగంగా సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచామని తెలిపారు. ప్రజలు అల్లర్లు సృష్టించకుండ భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు జరుపుకుని మొక్కుబడులు చెల్లించుకోవాలని సూచించారు. మొహరం వేడుకల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కుల, మతాలకు అతీతంగా అందరు ఐక్యంగా ఉండి మొహరం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఇంద్రుడు, పోలీస్ కానిస్టేబుల్ గోవర్ధన్, అయ్యస్వామి, అశోక్ తదితరులున్నారు.

## వైసిపి పాలనలో ప్రజలకు కష్టాలు లేవు



**లింగాల(కోవెలకుంట్ల)జూలై 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలో వైసిపి పాలన వచ్చినప్పటినుండి ప్రజలకు ఎలాంటి కష్టాలు లేవని వైసిపి సీనియర్ నాయకుడు శేష్టిరెడ్డి అన్నారు. జగనన్న సురక్షలో బాగంగా బుదవారము మండలములోకి లింగాల గ్రామంలో సర్పంచు నేతృత్వంలో జగనన్న సురక్ష నిర్వహించారు. ఇందులో యంపిడిఓ రాదిక, తహశీలుదారు పుష్పకుమారి, డిప్యుటి తమసీలుదారు చంద్రశేఖరు ఇతర శాఖల అదికారులో పాల్గొన్నారు. ఇందులో సట్టిపికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి దృవపత్రాలను వైసిపి సీనియర్ నాయకుడు శేష్టిరెడ్డి అందించారు.

## నింధితులను కఠినంగా శిక్షించాలి



**ఆదోని, జూలై 26, ప్రభాతవార్త :** మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసి మహిళలను నగ్న ప్రదర్శన చేసి అత్యాచారం చేసిన నింధితులను కఠినంగా శిక్షించాలని పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి మణి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు అఖండ, పివైఎల్ యువజన సంఘం నాయకులు రసూల్‌లు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని శ్రీనివాస భవన్ కూడలిలోని భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు నల్లగంతలు కట్టుకుని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసి మహిళలను నగ్న ప్రదర్శన చేసి అత్యాచారం చేసిన నింధితులను కఠినంగా శిక్షించాలన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయన్నారు. కుకి తెగకు చెందిన ఆదివాసి మహిళలను ఇద్దరిని నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారం చేసి హత్యా చేయడం సభ్యసమాజం తలదించుకునేలా ఉందని మండిపడ్డారు. బిజెపి పరిపాలిస్తున్న రాష్ట్రంలో గిరిజన ఆదివాసీల్లో మైనార్టీలపై అనేక దాడులు జరుగుతున్నాయని, మణిపూర్ రాష్ట్ర జనాభాలో 54శాతానికిపైగా ఉన్న మైతి కులస్తులకు కుక్కి, నాగ గిరిజన తెగల మద్య బిజెపి తన రాజకీయ లబ్ధి కోసం చిచ్చుపెట్టిందని ఆరోపించారు. గిరిజన చట్టాలను అతిక్రమించి మైత్రిలను గిరిజనులుగా మార్చడానికి ఒడిగట్టిందన్నారు. ఆదివాసీలను అడవుల నుండి దూరం చేసే కుట్రలు చేస్తుందని విమర్శించారు. అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఈ హింసాత్మక ఘటనలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాద్యత వహించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే రాజీనామా చేయాలని, దోషులను కఠినంగా శిక్షించి భాదితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు మండల నాయకురాలు మహాదేవమ్మ, ఏఐకెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకప్ప, పిడిఎస్‌యు జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, మండల నాయకులు పవన్, సునీల్, మహేష్, గర్జప్ప, చెన్ను, వీరేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చిన్నసెరిగేసు వేడుకలు



**ఆలూరు రూరల్, జూలై 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో పీర్ల దేవుళ్ల చిన్నసెరిగేసు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అగ్రహారం గ్రామంలో పీర్లచావడిలో వెలసిన పీర్ల దేవుళ్లకు పూజారి ఖాజాసాబ్ ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు ఈరన్న, ఉసేని, రంగముని, వీరేష్‌లు మాట్లాడుతూ చిన్నసెరిగేసు వేడుకల్లో భాగంగా స్వామి వార్లను ఊరేగించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. శుక్రవారం పెద్దసెరిగేసు జరుగనున్నట్లు తెలిపారు. శనివారం పీర్లదేవుళ్ల జలధి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే మండల పరిధిలోని కురువల్లి గ్రామంలో సర్పంచ్ రవి ఆద్వర్యంలో గ్రామస్తులు అలాంభాషా, బషీర్, తాతప్ప, హనుమంతు, వలిభాష, ఖాదర్‌భాషా తదితరులు చిన్నసెరిగేసు వేడుకలు భక్తుల మద్య ఘనంగా నిర్వహించారు. అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామాల్లో మొహరం వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ నాయక్ తెలిపారు.

## ఉపాధ్యాయుల జ్ఞానార్జన కోసమే సముదాయ సమావేశాలు



**నందికొట్కూరు, జూలై 26, ప్రభాత వార్త:** సముదాయ సమావేశాల ద్వారా ఉపాధ్యాయులకు జ్ఞానార్జన జరుగుతుందని ప్రధానోపాధ్యాయులు సలీంబాష తెలిపారు. బుధవారం కోట జిల్లా పరిషత్ హైస్కూల్ నందు రెండు రోజులుగా మండల పరిధిలోని స్కూల్ అసిస్టెంట్‌లకు, సెకండరీ గ్రేడ్ టీచర్లకు పాఠశాల సముదాయ సమావేశాలు కాంప్లెక్స్ అధ్యక్షులు సలీంబాష ఆధ్వర్యంలో జరుగుతున్నాయి. ముగింపు సంధర్భంగా ఫిజికల్ సైన్స్ పాఠశాల సహాయకులకు మరియు సెకండ్ గ్రేడ్ టీచర్లకు సమావేశం నిర్వహించారు. అనంతరం ఫిజికల్ డైరెక్టర్ శ్రీనాథ్ పెరుమాళ్ళ యోగా, ధ్యానం చేయించారు. సీనియర్ ఫిజికల్ సైన్స్ టీచర్లకు బోధనలో నూతన పద్దతుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## జ్యోతిర్లింగ రామ్ కథ యాత్రను జయప్రదం చేయండి

**-నేడు శ్రీశైలం చేరుకోనున్న యాత్ర**

**కల్లూరు, జూలై 26, ప్రభాతవార్త:** 12 జ్యోతిర్లింగాల మీదుగా విభిన్నమైన అధ్యాత్మిక ప్రయణాన్ని చేపట్టిన జ్యోతిర్లింగ రామ్ కథ యాత్ర గురువారం శ్రీశైలం చేరుకోనుందని యాత్ర విజయవంతానికి ప్రతిఒక్కరు కలసి రావాలని ఆదేశ్ ట్రస్ట్ భక్తుడు రూపేష్ వ్యాస్ బుధవారం కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రఖ్యాత అధ్యాత్మిక గురువు మొరారి బాపు సనాతన ధర్మం యొక్క మహిమలను గానం చేస్తు పవిత్రమైన సావన్ మాసంలో భారత దేశ సంపూర్ణమైన సాంస్కృతిక వారసత్వం యొక్క అద్భుతమైన గతాన్ని స్మరించుకుంటూ ముందుకు సాగుతుందన్నారు. ఈయాత్ర కేవలం 18 రోజుల్లో 12 వేల కిలోమీటర్ల పొడువునా జ్యోతిర్లింగాలను దర్శించుకుంటూ ఆగష్టు 8న ముగుస్తుందన్నారు. అందులో భాగంగానే శ్రీశైలం చేరుకోనుందని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రజలందరు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పాల్గొనవచ్చన్నారు. ఈయాత్రను విజయవంతం చేయడానికి తాను అర్టీసిత అవిశ్రాంతంగా కొనసాగుతున్నానని రూపేష్ వ్యాస్ వివరించారు.

## గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకొండి



**బండిఆత్మకూరు, జూలై 26, ప్రభాతవార్త:** గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశు భ్రంగా ఉంచే బాధ్యతలు పంచాయితీ కార్యదర్శులదే అని మండల ఇఓఆర్డీ శ్రీనివాసులు తెలి పారు. మండలంలోని ఈర్నపాడు గ్రామంలో ఎస్సీ కాలనీ నందు వర్షపునీరు రోడ్లపై నిలబడడంతో జేసిబి సహాయంతో డ్రైనేజీని పూడీకతీయించారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు మండలంలోని అన్ని గ్రామాల పంచాయితీ కార్యదర్శులతో ఇఓఆర్డీ, ఆర్‌డబ్ల్యుఎఈ లక్ష్మీనరసింహా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర బ్ంగా ఈఓఆర్డీ మాట్లాడుతూ గత వారం నుంచి వర్షాలు ఏడతెరిపిలేకుండా పడుతున్నాయని ఏ గ్రామంలోనైనా డ్రైనేజిలు మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రైనేజీ కాల్వల్లో పూడిక తీయాలని రోడ్లపై నీరు నిల్వ ఉండకుండ చర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదరు ్శలకు తెలియజేశారు గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను 15 రోజులకొకసారి శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని పైపులైన్ల లీకులు, పైప్‌లై ప్లాట్‌ఫాం డ్యామేజీ అయితే కొత్తవాటిని ఏర్పాటు చేసుకోవాలని లీకేజిలు ఉంటే సర్పంచ్ లతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని గ్రామాల్లో చెత్తచేదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మండలంలోని అన్నిగ్రామాల పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఐరన్‌బండలో ఘనంగా చిన్న సరిగెత్తు వేడుకలు



**గోనెగండ్ల జూలై 26 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని ఐరన్‌బండలో బుధవారం తెల్లవారుజామున చిన్నసరిగెత్తు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని పలు గ్రామాల్లో గత మూడు రోజులుగా చిన్న సరిగెత్తు, పగటి సరిగెత్తు, పెద్ద సరిగెత్తు వేడుకలను భక్తులు కులమతాలకు అతీతంగా భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఉదయం నుంచి భక్తులు పీర్ల చావిడిల దగ్గరకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. పీర్ల దేవుళ్లకు పూల దండలతో అలంకరించారు. భక్తులు చావిడిల దగ్గర చిందులు తొక్కారు. పలు విచిత్ర వేశదారణలతో భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. విచిత్ర వేశాలను గ్రామస్థులను అలరించారు. 28వ తేదిన మోమత్రం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ముజావర్లు ముల్లా పెద్ద వలి, ముల్లా మస్తాన్, చిన్న రంగూల్ భాషా తెలిపారు.

## ప్రభుత్వ సేవలను ఉచితంగా పొందండి

**:-వైసిపి మండల కన్వీనర్ భీంరెడ్డి**



**చెట్నహళ్ళి(మంత్రాలయం), జూలై 26, ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలను ఉచితంగా పొందవచ ్చని వైసిపి మండల కన్వీనర్ గుర్రెడ్డి భీంరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెట్నహళ్ళి, మంత్రాలయం గ్రామాల్లో నిర్వహించిన జగనన ్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పదకొండు రకాల సేవలను ఈ కార్యక్రమంలో ఉచితంగా పొందవచ్చని తెలిపారు. గ్రామంలో ఏమైనా సమస్యలు ఉంటే తమదృష్టికి తీసుకురావాలన్నారు. ఎంఎల్ఏ వై. బాలనాగిరెడ్డితో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని తెలియజేశారు. అనంతరంవివిధ రకాల దృవపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ చంద్రశేఖర్, కో-కన్వీనర్ రాఘవేంద్రాచారి, ఎంపిడిఓ మణిమంజరి, సర్పంచ్‌లు ఆంజనేయులు, తెల్లబండ్ల భీమయ్య, ఎంపిటిసి రామాంజినేయులు, పిఆర్ఏఈ నరసింహులు, ఏఈఓ నరసింహుదు, ఏపిఓ తిమ్మారెడ్డి, ఏపిఎం జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## భూముల రికార్డుల ఆధారంగా రీసర్వే



**ప్యాపిలి జూలై26(ప్రభాతవార్త):** రైతుల భూములు రికార్డుల ఆధారంగా రీసర్వే చేస్తామని డోన్ ఆర్డీవో వెంకటరెడ్డి అన్నారు. మండల పరిధిలోని కలచట్ల గ్రామ సచివాలయం పరిధిలోని ఎస్. రాయంపేట గ్రామంలో బుధవారం భూముల రికార్డులను పరిశీలించి గ్రౌండ్ సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల డేటాను పరిశీలించి భూముల కొలతల విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండ సరే ్వ నిర్వహిస్తున్నట్లు వివరించారు. కొలతల విషయంలో తప్పులుంటే మళ్ళీ సర్వే చేసుకోవడం కోసం సర్వేయర్లను కేటాయించినట్లు ప్రకటించారు. రైతులకు ఇబ్బందులు కలిగించకుండ భూములను రీసర్వే చేయాలని కోరారు. రైతులు తమ వద్ద ఉన్న రికార్డులను సర్వే సమయంలో తీసుకుని రావాలని సూచించారు. అనంతరం తాహసిల్దార్ కార్యాలయంలో ఎల్‌పిఎం 331 భూముల రీసర్వే వివరాలను ఆర్డీవో పరిశీలించారు. ఈ కార ్యక్రమంలో తాహసిల్దార్ చంద్రశేఖర్‌వర్మ, విఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## వీధిలైట్లు ఏర్పాటు చేసిన సర్పంచ్



**కౌతాళం, జూలై26, ప్రభాతవార్త ;** మండలంలోని కుంటనహాల్ గ్రామంలో సర్పంచ్ కుమారుడు శివరామ్ బుధవారం వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. మొహర్రం సందర్భంగా గ్రామాల్లో వీధిలైట్లు ఏర్పాటు చేసి, పారిశుద్ధ్య పనులు చేపట్టామని చెప్పారు. కురుస్తున్న వర్షాల కారణంగా ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపడతామన్నారు. ప్రజలు కూడా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సమస్యలు ఏవైనా ఉంటు తమదృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

## హజ్‌యాత్రలో ఆదోనివాసి మృతి



**ఆదోనిటౌన్, జూలై26, ప్రభాతవార్త ;** హజ్‌యాత్రకు వెళ్లిన పట్టణంలోని బార్‌పేటకు చెందిన ముండి రఫిక్‌అహ్మద్(68) అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచినట్లు బంధువులు తెలిపారు. గత నెల జూన్ 9వ తేదిన ఆదోని నుంచి మక్కాకు బయలుదేరారు. అక్కడ చురుగ్గా ప్రార్థనల్లో పాల్గొని ఉమ్రా పూర్తి చేశారు. జూన్ 16వ తేదిన రాత్రి ఒక్కసారిగా మక్కాలో అకస్మాత్తుగా కిందకు పడిపోవడంతో తోటి యాత్రికులు మక్కాలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. తోటి యాత్రికులు బంధువులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఉమాన్‌లో ఉద్యోగం చేస్తున్న రఫిక్ కుమారుడు షేక్అహ్మద్ మక్కాకు చేరుకొని ఆయన బాగోగులు చూసుకున్నాడు. కొన్ని రోజుల తర్వాత కోలుకున్న రఫిక్‌అహ్మద్ డాక్టర్ల సాయంతో హజ్‌యాత్రను పూర్తి చేశాడు. బుధవారం ఉదయం రఫిక్‌అహ్మద్‌కు బీపీ లో కావడంతో మృతిచెందారు. రఫిక్‌అహ్మద్ మృతి పట్ల మతగురువులు ముఫ్తీ అసీఫుద్దీన్‌ఖాద్రి, ఖాలీద్‌నిజామీ, హఫీజ్‌షబ్బీర్‌అహ్మద్, సాజిద్‌నిజామీ సంతాపం తెలియజేశారు. మృతుడు పట్టణంలో స్టోర్ డీలర్గఅ పనిచేస్తున్నాడు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## కస్బా స్కూల్ విద్యార్థులకు వైద్యపరీక్షలు



**బనగానపల్లె, జూలై26, ప్రభాతవార్త:** బనగానపల్లె పట్టణంలోని కసా ్బ ప్రాథమిక పాఠశాలలో టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శివశంకరుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ పోగ్రామ్‌లో భాగంగా డాక్టర్ శివశంకరుడు పాఠశాలకు వచ్చి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించే వర్షాకాలంలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి ఎలా ఉండాలో వివరించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మహిళలకు బీపీ, షుగర్, ప్రసవానంతర తల్లులు మరియు వ్యాధిగ్రస్తులను కూడా పరిక్షించి మందులు అందజేశారు. ఈ కార్య క్రమంలో పాఠశాల హెచ్ఎం సుంకన్న, సీనియర్ ఉపాధ్యాయుడు, యూటీఎఫ్ జిల్లా నేత సత్యప్రకాష్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## "ఉపాధ్యాయులకు ప్రారంభమైన శిక్షణా తరగతులు"



**కొలిమిగుండ్ల, జూలై 26, ప్రభాతవార్త :** మండలకేంద్రమైన కొలిమిగుండ్లలోని ఎంఇఓ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు బుధవారం శిక్షణా తరగతులు ప్రారంభయ్యాయి. మండల విద్యాధికారులు రాజయ్య, అబ్దుల్‌కలాం లు ఉపాధ్యాయులకు పలు అంశాలపై ప్రత్యేక సూచనలు చేశారు. విద్యార్థులకు ప్రత్యేక బోధన, ప్రభుత్వ పథకాల పంపిణీ, విద్యాభివృద్ధి తదితర అంశాలపై ప్రత్యేక సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పిలు కమల, మద్దిలేటి, కాంతారావు, అయా గ్రామాల పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎరువుల అంగడి యజమానుల ఆధ్వర్యంలో వరుణయాగం



**చాగలమర్రి, జూలై26, ప్రభాతవార్త:** జూలై చివరి వారం అయినప్పటికి పుష్కలంగా వరుణుడు కరుణించకపోవడంతో వర్షాలు కురవాలని ఫెస్టిసైడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ విత్తనాల దుకాణాల యజమానులు బుధవారం భారీ ఎత్తున వరుణయాగం చేపట్టారు. మండల కేంద్రమైన చాగలమర్రికి సమీపంలో ఉన్న బుగ్గమల్లేశ్వర శివాలయంలో వేదపండితులు రవికిషోర్ శర్మ, మణిశర్మ, యజ ్వశర్మల ఆధ్వర్యంలో ఆదవేణి రవి, తల్ల నాగరాజు యాదవ్, ప్రసాదరెడ్డి, దస్తగిరి, లక్ష్మినారాయణ, చంద్రమౌలీరెడ్డి, షరీఫ్, గోపి, రాజశేఖర్‌రెడ్డి, మాబు, బ్రహ్మం, భారతిరెడ్డిల ఆధ్వర్యంలో పెద్దఎత్తున వరుణయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజా, కలశపూజా, 108బిందెలతో శివుడికి జలాభిషేకం, హోమం, వరుణయాగం నిర్వహించారు. ఈ యాగంలో ప్రత్యేక పూజలతో అనేక మంది భక్తుల మధ్య వేదపండితులు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులు పంటలువేసుకుని అధిక దిగుబడులు సాధించాలని వరుణదేవుడికి పూజలు నిర్వహించామని ఫెస్టిసైడ్స్ దుకాణాల యజమానులు తెలిపారు. అలాగే ఆళ్లగడ్డ వ్యవసాయ సంచాలకులు రాంమోహన్‌రెడ్డి, చాగలమ ర్రి మండల వ్యవసాయాధికారి రంగనేతాజీలను ఫెస్టిసైడ్స్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షులు ఆధ ్వర్యంలో ఫెస్టిసైడ్స్ యజమానులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గోపి, సుబ్బారెడ్డి, షరీఫ్ , రాజశేఖర్‌రెడ్డి, బాబు, ఓబులేసు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ వరుణయాగం సందర్భంగా అక్కడికి వచ్చిన భక్తులకు ఫెస్టిసైడ్స్ అండ్ ఫర్టిలైజర్స్ దుకాణాల యజమానుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## మిరప పంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

**--నాసిరకం విత్తనాలను సరఫరా చేసిన విత్త న కంపెనీలపై చర్యలు తీసుకోవాలి...**



**వెల్దుర్తి, జులై26, ప్రభాతవార్త :** మిరప పంట రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపి రైతుసంఘం రాష్ట్రకార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామళ్లకోట గ్రామంలో నాసిరకం మిరప నారను నాటుకొని పంట పండక నష్టపోయిన రైతులను బుధవారం ఆయన రైతుసంఘం జిల్లాకార్యదర్శి రామక్రిష్ణ, డివైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి వై. నగేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని రామళ్లకోట, కలుగోట్ల, సర్పరాజపురం, ఎస్. బోయినపల్లి, నర్సాపురం తదితర గ్రామాల్లో రైతులు వేల ఎకరాల్లో మిరప పంటను వేసి తీవ్రంగా నష్టపోయారన్నారు. మిరప నర్సరీల నుండి ఒక్కొక్క మొక్క 70పైసల నుంచి 80 పైసల చొప్పున ఎకరాకు రూ.20వేల మొక్కలు వేశామని, కూలీల ఖర్చులు, ఎరువులు, పురుగుల మందులు కలిపి ఒక ఎకరాకు రూ.70వేల నుంచి 80వేల వరకు పెట్టుబడి పెట్టి నష్టపోవడం జరిగిందని రైతులు తమతో బాధలు చెప్పుకొని ఆవేదన చెందారన్నారు. వ్యవసాయశాఖ అధికారులు రైతుల పంటలను పరిశీలించి నాసిరకం, నకిలీ విత్తనాలు ఇచ్చిన కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ఏపి రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుందన్నారు. మిరపపంటలతో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. వెల్దుర్తి మండలంలోని ఒక రామళ్లకోటలోనే వేలాది ఎకరాల్లో మిరపపంటను వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి రైతుసంఘం రాష్ట్రకార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, రైతుసంఘం జిల్లాకార్యదర్శి రామక్రిష్ణ, డివైఎఫ్ఐ జిల్లాకార్యదర్శి వై. నగేష్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## దళిత స్నేహితులతో కంచం పంచుకున్నా....

**మిడుతూరు, జూలై26, ప్రభాతవార్త ;** మా సహ ఉద్యోగుల కులం తెలియదు. కు లాల ప్రసక్తి తీసుకొని



రాకండి నేను దళిత స్నేహితులతో కంచం పంచుకున్నాం.. దయచేసి నాపై నిందలు వేయకండి అంటూ ఎంపీడీఓ జి.ఎన్.ఎస్. రెడ్డి భావోద్వేగంతో గద్గత స్వరంతో తన బాధను వెళ్లగక్కారు. మిడుతూరు మండల అభివృద్ధి కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇటీవల గ్రామంలో తలముడిపి గ్రామంలో సచివాలయ పరిధిలో జరిగిన గొడవలో దళితులైన నన్ను ఎవరో పరామర్శించలేదని, ఎవరూ స్పందించలేదని విమర్శించారు. దీంతో వెంటనే స్పందించిన ఎంపీడీఓ మాట్లాడుతూ సమావేశంలో ఇలాంటి విమర్శలు చేయకూడదని, సంబంధంలేని విషయాలు మాకు అంటగట్టవద్దన్నారు. నేను మండలంలో చేతనైన కాటికి ఉద్యోగం చస్తున్నాను, నేను ఇప్పటికే ట్రాన్స్ ఫర్ కూడా పెట్టుకున్నాను. నేడో రేపో బదిలీ కూడా రావచ్చు. నేను మండలానికి చేసిన సేవలు ఇక చాలు. మీరు ఎవరైనా ఇంతకుమించి మంచి అధికారులు తెచ్చుకోండి అంటూ తన అభిప్రాయాన్ని ఎంపీడీఓ వెల్లడించారు. మా పరిధిలో నేను ఉద్యోగం చేస్తున్నా ఇద్దరు లీడర్లు పనిచేయమని చెబుతారు. చేసే పని ఒకరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా ఇన్ని రోజులు ఉద్యోగ బాధ్యతలతో నెట్టుకొచ్చానని, నేను ఎవరికి అనుకూలంగా సొంత నిర్ణయాలు తీసుకోలేదని, నా పరిధి మించిన నిర్ణయాలను నా ఉన్నతాధికారులకు లెటర్ ద్వారా తెలియజేసిన సందర్భాలు చాలా ఉన్నాయన్నారు. సర్పంచ్ ఆరోపిస్తున్నట్లు ఎవరినీ అవమానపరిచిన సందర్భాలు లేవని, ఒకవేళ ఏవైనా నాకు తెలియకుండా ఉంటే నన్ను క్షమించడం, ఎందుకంటే ఏ వ్యక్తి మా దగ్గరకు వచ్చినా ముందుగా కుర్చీలో కూర్చోమన్నాకే నేను మాట్లాడానని ఇది ప్రతిఒక్కరు అర్థం చేసుకోవాలన్నారు. ఇక తలముడిపి గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన గొడవ విషయంలో సంబంధిత అధికారులతో చర్చించడం జరిగిందని ఎంపీడీఓ చెప్పారు.

## పియం కిసాన్ ఈకేవైసి త్వరగా పూర్తి చేయ్యాలి

**కొత్తపల్లి, జూలై26, ప్రభాతవార్త ;** పియం కిసాన్ ఈకేవైసి త్వరగా పూర్తి చేయా ్యలని ఏడిఏ ఆంజనేయ అన్నారు.



ఆయన బుధవారం దుద్యాల గ్రామ రైతుభరోసా కేంద్రంను తనిఖీ చేశారు అనంతరం వాలెంటీర్‌లతో సమావేశమయ్యారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పియం కిసాన్ ఈకేవైసి రైతులను గుర్తించి త్వరగా ఈకేవైసి పూర్తి చేయా ్యలన్నారు. గ్రామంలోని రైతు భరోసాకేంద్రంలో తగినంత ఎరువులు ఉన్నాయని గ్రామ రైతులకు తెలియజేసి సద్వినియోగం చేసుకునేల అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతినకుండా తగుజాగ్రత్తలు తీసుకునేల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలోని వాలెంటిర్‌లు వ్యవసాయ పథకాలను గురించి రైతులకు తెలియజేసి అర్హులైన లబ్దిదారులకు పథకాలను వర్తింపచేయలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచి శోభలత, పంచాయతీ సెక్రటరీ పార్థసారధి, రైతుభరోసా కేంద్రం సహాయకులు శేషు మరియు వాలెంటిర్ లు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన పాఠశాలలకు విద్యార్థులను దూరంగా ఉంచండి

**నంద్యాల విద్య, జూలై 26, ప్రభాతవార్త:** గత నాలుగు రోజులుగా జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా శిథిలావస్థలో ఉన్న పాఠశాలల్లో గదులను విద్యార్థులను కూర్చోబెట్టడం తరగతులు నిర్వహించడం చేయకూడదని జిల్లా విద్యాశాఖాధికారి కె సుధాకర్‌రెడ్డి హెచ్‌ఎంలను, ఎంఇఓలను ఆదేశించారు. గదుల నిర్మాణం కోసం తీసిన గుంతల చుట్టు విద్యార్థులు వెల్లకుండా రడ్‌రిబ్బన్‌లు, కంచె ఏర్పాటు చేయాలన్నారు. ప్రహారిగోడ వద్ద విద్యార్థులు ఉండరాదు. కరెంటు వైర్లు తెగిఉండుట, కిందకు వేలాడి ఉండరాదు. స్విచ్‌బోర్డుల వద్ద పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలి. పాఠశాలల్లో ఎక్కడా కూడ వర్షపునీరు నిలిచి ఉండకూడదు. వేరే గ్రామాల నుంచి విద్యార్థులు వాగులు, వంకలు దాటి పాఠశాలకు రావాల్సి వస్తే తల్లిదండ్రులు తోడు ఉండాలి. విద్యార్థులు వర్షంలో తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సంఘటన స్థలంలో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

ఓపెన్‌స్కూల్స్‌లో అడ్మిషన్ల ప్రక్రియ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఓపెన్ స్కూల్‌ద్వారా 2023-24 విద్యాసంవత ్సరంలో పదవతరగతి ఇంటర్మీడియేట్ కోర్సులో ప్రవేశం కోసం నోటిఫికేషన్ విడుదల అయిందని విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవచ్చుని డిఇఓ సుధాకర్‌రెడ్డి, ఓపెన్‌స్కూల్ కో-ఆర్డీనేటర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ధరఖాస్తులను అన్‌లైన్‌లో సబ్‌మిట్ చేసుకోవడానికి జూలై 27 నుంచి ఆగష్టు 31 వరకు గడువు ఉందని తెలిపారు. పదవ తరగతిలో చేరేందుకు ఆగష్టు 31 నాటికి 14 సంవత ్సరాల వయసు నిండి ఉండాలి, చదవడం, రాయడం తెలిసి ఉండాలి. ధరఖాస్తుతో పాటు టిసి, రికార్డు సీటు, పుట్టినతేది ధృవీకరణ పత్రం, ఇంటర్‌కు పదవతరగతి మార్కుల జాబితా, టెన్త్ టిసిని ధరఖాస్తుతో జతపరచాలి. ఎస్సీ, ఎస్టీ, బిసి అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రంతో ధరఖాస్తు చేసుకోవాలి.

## వర్షం జోరు....రైతు బజారు బంద్‌తో వినియోగదారులు బేజారు...

**కర్నూలు విద్య, జూలై 26, ప్రభాతవార్త:** క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా రైతు బజారును బంద్ చేయడం జరిగింది.



బంద్‌కారణంగా వినియోగదారులు భారీ వర్షంలోనే కూరగాయలు కొనుగోలు చేయడం ఇదే అవకాశంగా ఉపయోగించుకున్న వ్యాపారులు టమోటాలు రైతు బజారులో ఉన్న ధర కన్నా అధిక ధరలకు అమ్ముతున్నారు. రైతు బజారులో టమోట ధర రూ.100లు ఉండగా, రైతు బజారు బంద్ కారణంగా రూ.120 నుంచి రూ.150ల వరకు రోడ్డు మీద వినియోగదారులు కొనుగోలు చేయుచునా న్నరు. మిగతా కూరగాయాలు కూడ అధిక ధరలకు అమ్ముతున్నారు. వినియోగదారులు చేసేది ఏమి లేక వారు చెప్పిన ధరకే తీసుకొని పోవాల్సి వస్తుంది. రైతు బజారు ఏడి నారాయణమూర్తిని వివరణ అడగ్గా గతంలో కోవిడ్‌రూల్స్ ప్రకారం ప్రతి నెల అఖరి వారంలో క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా బంద్‌చేయడం జరిగిందని తెలిపారు.

## భారీ వర్షాలతో అప్రమత్తం

### కలెక్టరేట్,ఆర్డీవో కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూంల ఏర్పాటు

• టెలికాన్ఫరెన్స్లో సంబంధిత అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. జి. సృజన

**కర్నూలు, జూలై 26, ప్రభాతవార్త :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాను రెడ్ అలెర్ట్ గా ప్రకటించడం జరిగిందని,ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.జి.సృజన అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం వర్షాల నేపథ్యంలో ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లతో జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో శిథిలమైన భవనాలు ఉన్న చోట ప్రజలను బయటకు తీసుకొని రావాలని కలెక్టర్ పేర్కొన్నారు. వీలైనంత వరకు ప్రజలు బయటికి రాకుండా ఇళ్లల్లోనే ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా నదీ పరీవాహక ప్రాంతాలు, చెరువులు ఉన్న ప్రాంతాల అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, వర్షపాత నమోదు శాతం ఎక్కువైనా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఎప్పటికప్పుడు సమాచారాన్ని తన దృష్టికి తీసుకొని రావాలని కర్నూలు, పత్తికొండ ఆర్డీవో లను, ఆదోని సబ్ కలెక్టర్ ను, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు.. కలెక్టరేట్,ఆర్డీవో కార్యాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూం లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు..రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని టెలికాన్ఫరెన్స్లో సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియోలో 100 శాతం పురోగతి సాధించాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు.. కళాశాలలు, పాఠశాలల మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టి మండల విద్యాశాఖ అధికారులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు చైల్డ్ ఇన్ఫో లో అప్డేట్ చేయించే విధంగా చర్యలు తీసుకోవాలని డిఈఓ, ఆర్ఐఓ, మండల స్పెషల్ ఆఫీసర్లను, ఎంపీడీవోలను, మున్సిపల్ కమిషనర్లను కలెక్టర్ ఆదేశించారు. ఈరోజు సాయంత్రం లోపు 100 శాతం గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.టెలికాన్ఫరెన్స్లో నగరపాలక కమిషనర్ భార్గవ్ తేజ, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, కర్నూల్, పత్తికొండ ఆర్డీవోలు, సర్వ శిక్ష అభియాన్ పిఓ వేణుగోపాల్, తహసిల్దార్లు, ఎంపీడీవోలు,మండల విద్యా శాఖ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటల పరిశీలన



**చాగలమర్రి, జూలై26, ప్రభాతవార్త:** చాగలమర్రి మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఉద్యానవన పంటలు జామ,సపోటా,సీతాఫలం,మామిడి తోటలను రాష్ట్ర హార్టికల్చర్ డిప్యూటీ కమిషనర్ భవాని బుధవారం పరిశీలించారు.ముత్యాలపాడు గ్రామంలో రైతులు సాగుచేసిన ఉద్యానవన తోటలల్లో మొక్కల ఎదుగుదల, పంట విధానాన్ని పరిశీలించారు.జామ తోటలల్లో వచ్చే పండుఈగ తెగులు నివారణ గురించి రైతులకు సూచనలు ఇచ్చారు.రైతులు వేసిన పంటలను అధిక దిగుబడులు సాధించాలంటే లాభదాయకమైన ఉద్యానవన పంటలను సాగుచేసిన అభివృద్ధి చెందాలన్నారు.రైతులను పంటల దిగుబడులను అడిగి తెలుసుకున్నారు.గత రెండు సంవత్సరాలుగా ఉపాధిహామీ పథకం ద్వారా వచ్చే వేతనాలు సరిగా అందడంలేదని రైతులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.రైతులకు ఉద్యానవన పంటలకు సంబంధించిన వేతనాలను వెంటనే చెల్లించేందుకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఆమె వెంట ప్రాజెక్టు అధికారి రామచంద్రారెడ్డి,అడిషనల్ ప్రాజెక్టు అధికారి సాంబశివుడు,ఏపీవో నిర్మలా,ఉపాధి సిబ్బంది ఉన్నారు.

## చుక్కలు చూపుతున్న ఉల్లి నారు ధర

-మడి ధర రూ.4500



**గోనెగండ్ల జూలై 26 ప్రభాతవార్త :** ఒక్క సారిగా ఉల్లి ధర ఆకాశాన్ని అంటింది.నిన్న మొన్నటి వరకు ఉల్లి నారు వైపు కన్నెత్తి చూడని రైతులు నాలుగురోజుల నుంచి వర్షాలు కురుస్తుండడంతో నారుమళ్ల వద్ద కు రైతులు క్యూ కడుతున్నారు.ఉల్లినారు సాగు చేసిన రైతులు అమాంతంగా రేటు పెంచేశారు.ఒక బెడ్(మడి) ధర రూ.4500పలకుతుంది. ఒక ఎకరంలో ఉల్లి నారు సాగుకు రూ.70వేలు ఖర్చు అవుతుంది.ఇందులో 180 నుంచి 200 వరకు బెడ్లు పడతాయి. ఒక ఎకరంలో ఉల్లి సాగు చేసేందుకు 6 నుంచి 8 బెడ్లు(మడి) కావాలి.అయితే గత కొన్ని రోజులుగా ఉల్లికి ధర లేక పోవడంతో ఉల్లి నారు సాగుకు రైతులు మక్కువ చూపలేదు.ఇప్పటికి మండలంలో దాదాపు 50ఎకరాల్లో మాత్రమే ఉల్లి నారు సాగు చేశారు.ఇక ఉల్లినారు సాగు చేసిన రైతులకు కనకవర్షమే అని రైతులు చెప్పుకుంటున్నారు.

## సంజామల ఎంఇఓ-2ను ఆర్జేడి కార్యాలయానికి సరెండర్

- బడిఈడు గల పిల్లలు పాఠశాలల్లోనే ఉండాలి : కలెక్టరు



**నంద్యాల విద్య, జూలై 26, ప్రభాతవార్త:** బడిఈడు గల పిల్లలు నూరుశాతం పూర్తి కావాలని గ్రాస్ ఎన్రోల్మెంటు సర్వే నమోదు ప్రక్రియ అధ్వానరీతిలో వున్నందున సంజామల ఎంఇఓ-2 ఈశ్వరయ్యను కడప అర్జేడి కార్యాలయానికి సరెండర్ చేయాలని డిఇఓ సుధాకర్రెడ్డిని జిల్లా కలెక్టరు డా.మనజీర్ జిలాని సమూన్ అదేశించారు. బుధవారం కలెక్టరేట్లోని తన చాంబర్ నుంచి బడిఈడు పిల్లల స్థూల నమోదు నిష్పత్తిపై ఎంఇఓలతో జూమ్ విడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ సచివాలయ పరిధిలోని వాలంటీర్ల ద్వారా 5 నుంచి 18 సంవత్సరాల లోపు బడిఈడు పిల్లల నమోదు నూరుశాతం నమోదు చేయాలని అదేశించారు. సచివాలయ పరిధిలో తక్కువ జనాభా ఉన్నప్పటికి గ్రాస్ ఎన్రోల్మెంటు రేషియో ఎందుకు పూర్తిచేయలేకపోతున్నారని ఎంఇఓలను కలెక్టరు ప్రశ్నించారు. వాలంటీర్ ద్వారా ప్రతిఒక్కరిని గ్రీన్ సర్వే చేయించి నమోదు చేయాలన్నారు. సర్వేను సంబంధిత కళాశాలలు, పాఠశాలల విద్యాధికారులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చైల్డ్ఇన్ఫోలో అప్డేట్ చేయాలని అదేశించారు. సచివాలయంలోని సిబ్బంది, డిఇఓ, ఆర్ఐఓ, మండల స్పెషల్ అఫీసర్లను, ఎంపిడిఓలను, మున్సిపల్ కమిషనర్లను అప్రమత్తంగా ఉండి బడిఈడు గల పిల్లలు పాఠశాలల్లో వుండే విధంగా చర్యలు తీసుకోవాలని అదేశించారు. సమావేశంలో డిఇఓ సుధాకర్రెడ్డి, ప్రత్యామ్నాయ పాఠశాలల కో-ఆర్డినేటర్ రఘురామ్రెడ్డి, పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో.. నీటిపాలవుతున్న పుస్తకాలు



**మిడుతూరు, జూలై26, ప్రభాతవార్త ;** అక్షరాస్యులకు మరింత విజ్ఞానాన్ని పెంచే గ్రంథాలయ పుస్తకాలు నీటిపాలవుతున్నాయి. మండలకేంద్రంలో గ్రంథాలయం ఉన్న భవనం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీటిపోటుకు పెట్టి పుస్తకాలన్నీ తడిసిముద్దవుతున్నాయి. విలువైన పుస్తకాలు తడవకుండా తాత్కాలిక చర్యలు గ్రంథాలయ అధికారి పరిమళ చేపట్టినా వర్షం నీరు ఆగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశ్యంతో నిధులు మంజూరు చేస్తూ నూతన భవన నిర్మాణాలు చేపడుతున్నారు. అదేవిధంగా ఆ విద్యార్థులకు మరింత విజ్ఞానం పెంచే గ్రంథాలయ నూతన భవనాల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. గ్రామంలో గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి స్థలం లేనందు వల్లే ఈ సమస్య తలెత్తిందని గ్రంథాలయ అధికారి చెప్పారు. కనుక సంబంధిత అధికారులు గ్రామపెద్దలు ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టి గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి స్థలం గుర్తించి సమస్య పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.

## బడి బయట పిల్లలందరూ బడిలో ఉండాలి : కలెక్టర్ డా.సృజన



**కర్నూలు, జూలై 26, ప్రభాతవార్త :** బడి బయట పిల్లలందరూ బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను మండల విద్యా శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ డా.జి.సృజన ఆదేశించారు. బుధవారం నగరంలోనీ బి.క్యాంప్ లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, గాయత్రి ఎస్టేట్లోని నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి బడి బయట పిల్లలను బడిలో చేర్పించడం, స్టూడెంట్ ఇన్ఫో అప్డేషన్ అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తొలుత బి.క్యాంప్ లో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు.. ఈరోజు ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు, ఎంతమంది గైర్హాజరయ్యారని ఆరా తీశారు.. ఈ పాఠశాల పరిధిలో బడి బయట పిల్లలు ఉన్నారా, ఉంటే వారిని ఎన్రోల్ చేశారా, బడిబయట పిల్లలను బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సిస్టం డ్రాప్ ఔట్స్, స్కూల్ డ్రాప్ ఔట్స్ అందర్నీ స్టూడెంట్ ఇన్ఫోలో అప్డేట్ చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.. అనంతరం గాయత్రి ఎస్టేట్లోని నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ పాఠశాలలో ఫిజికల్ గా ఎంతమంది ఉన్నారు, రికార్డు పరంగా ఎంత ముందు విద్యార్థులు నమోదయి ఉన్నారని ఆరా తీశారు. పాఠశాలల్లో చేరిన వారి వివరాలన్నీ స్టూడెంట్ ఇన్ఫోలో అప్డేట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాల నుంచి బయటికి వెళ్లిన విద్యార్థులు ఎంతమంది ఉన్నారు. వెళ్లిన వారిలో ఎంతమంది టీసీ తీసుకుని వెళ్లారు, ఎంతమంది టీసీ తీసుకొని వెళ్లలేదు అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. 60 మందికి టీసీ లకు జారీ చేయక పోవడంతో ఎందుకు టీసీ లు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రైవేట్ యాజమాన్యాలు తరగతులు పూర్తి చేసిన వారందరికీ టీసీలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు..బి క్యాంపు లోప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం అమలును పరిశీలించారు.. పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనాలు అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.. భోజనాన్ని కూడా పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని పదవ తరగతి కి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు.. టీచర్స్ క్లాస్ కి సరిగా వస్తున్నారా, పాఠాలు చెబుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ హనుమంతరావు, యంఈఓ లు విజయ కుమారి,ప్రభావతమ్మ, తదితరులు ఉన్నారు.

## జోరు వర్షంలోనూ గడప గడపకు మన ప్రభుత్వం



**తుగ్గలి, జూలై 26, ప్రభాతవార్త :** జోరు వర్షంలోనూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ నిర్వహించారు. బుధవారం మండల పరిధిలోని నల్లగొండ,నున్నసరాళ్ల గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ఎమ్మెల్యే ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు కదిలారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు నునసరాళ్ల సర్పంచ్ రామలక్ష్మమ్మ,సర్పంచ్ గౌరవ సలహాదారుడు గోపాల్రెడ్డి,సచివాలయ కన్వీనర్ రంగారెడ్డి,ప్రతాప్రెడ్డి,శ్రీనివాస్రెడ్డి,ఫీల్డ్ అసిస్టెంట్ రమణారెడ్డితో పాటు పలువురు గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం జగన్మోహన్రెడ్డి సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ ద్వారా అవినీతికి తావులేకుండ సంక్షేమ ఫలాలను లబ్దిదారులకు నేరుగా అందిస్తున్నారన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జిట్టా నాగేష్,సచివాలయ మండల కన్వీనర్ హనుమంతు,వక్ఫ్బోర్డు చైర్మన్ హుస్సేన్,మారెళ్ల సింగిల్విండో అధ్యక్షులు అట్లా గోపాల్రెడ్డి,పగిడిరాయి జగన్నాథ్రెడ్డి,రామచంద్రారెడ్డి,రాతన మోహన్రెడ్డి,తుగ్గలి మోహన్రెడ్డి,జొన్నగిరి గుంత రఘు,రామకొండ సుధాకర్రెడ్డి, రాంపల్లి నాగభూషణంరెడ్డి,ప్రేమ్నాథ్రెడ్డి,బొందిమడుగుల మునిరెడ్డి,ఈశ్వర్రెడ్డి, మారెళ్ల సుధాకర్రెడ్డి,విష్ణువర్ధన్రెడ్డి,లింగన్న,శభాష్పురం రాఘవరెడ్డితో పాటు ఆయా గ్రామాల వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాతకోట పశువుల అసుపత్రి జలమయం

- ఇబ్బందుల్లో వైద్యాధికారి సిబ్బంది



**పగిడ్యాల, జూలై 26 ప్రభాత వార్త :** బంగాళఖాతంలో ఉపరిత ల అవర్తనం ప్రభావంతో ఎడతెరిపిలే కుండా కురుస్తున్న వర్షాల కారణంగా పగిడ్యాల మండలం లో కుంటలుచెరువులు వంకలు వాగులు పొంగిపొరలుతున్నాయి. దీంతో రైతులు రైతు కూలీలు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పగిడ్యాల మండలం పడమర ప్రాతకోటలోని పశువుల అసుపత్రి చుట్టూ వర్షంనీరు చేరుకోవడంతో జలమయంగా మారింది. దీంతో పశువులకు అనారోగ్యాలకు గురైతే అసుపత్రికితీసుకుని వెళ్లి చికిత్స చేయించేందుకు పశువులయజమానులు, పశువైద్యాధికారి డాక్టర్ సుమన్, సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. కురుస్తున్న వర్షాలవల్ల పశువుల అసుపత్రి భవనం పొటుకుపెట్టడంతో ఆసుపత్రి గదులు చిత్తడిగా మారడంతో ఒక మూలన కూర్చోని వైద్యాధికారి డాక్టర్ సుమన్ విదులు నిర్వహిస్తూసతమతమైపోతున్నారు. పశువులకువైద్యంచేసేందుకు వైద్యాధి.కారి నానాయాతన పడుతున్నారు. కావున అసుపత్రి భవన నిర్మాణం శిథిలావస్థకుచేరుకుంది. కావున తాత్కాలికంగా మరమత్తులుచేపట్టడంతో పాటు అసుపత్రిపరిసరప్రాంతం పల్లంగా వుండట ంతో కొద్దిపాటి వర్షానికి వర్షంపునీరు నిల్వవుండటంతో ఇబ్బందులకు గురవుతున్నారు. కావున జిల్లా అధికారులుస్పందించి పశువుల అసుపత్రిమరమత్తులు చేపట్టాలనీ పశువుల యజమానులు కోరుతున్నారు. కావున పశువుల అరోగ్యాలను దృష్టిలోపెటుకుని పశువులయజమానుల సంక్షేమం కోసం శిథిలావస్థకు చేరుకున్న పశువుల అసుపత్రి మరమత్తులు చేపట్టవలసిన అవసరంఎంతైనావుంది.

## సంక్షేమ పాలన అంటే గుర్తుకు వచ్చేది జగనన్న ప్రభుత్వం-కాటసాని



**కోవెలకుంట్ల, జూలై 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలో సంక్షేమ పాలన అంటే ఒక్క జగనన్న ప్రభుత్వము అందరికి గుర్తుకు వస్తుందని యంయల్ఏ కాటసానిరామిరెడ్డి అన్నారు. బుదవారము జోరు వానను కూడా లెక్క చేయకుండా సంజామల మండలంలోని పేరుసపోమల్లో గడప గడపనకు మన ప్రభుత్వం కార్యక్రమము మండల ఉపాధ్యక్షులు చిన్నబాబు నేతృత్వంలో నిర్వహించారు. ఈసందర్భముగా అయన అక్కడ రూ 5లక్షలతో నిర్మించిన ఉచిత మినరల్ వాటు ప్లాంటును, అలాగే రజికులకు దోభీఘాట్ల కోసం 80సెంట్ల స్థలము, అలాగే హిందులకు 3ఎకరాలు., ముస్లీంలకు 2 ఎకరాలు శ్మశాన వాటికలకు కేటాయించారు. అనంతరము ఏర్పాటు చేసిన సమావేషములో 98మంది పేద లబ్దిదారుకలు 98ఇళ్ల పట్టాలను అయన పంపిణీ చేశారు. ఈసందర్బముగదా అయనమాట్లాడుతూ మన దేశంలో ఎక్కడ లేని విదముగా సంక్షమే చేపట్టినన ఘనత ఒక్క జగన్మోహన్రెడ్డికే దక్కిందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు ఇవ్వడమే కాకుండా అబివృద్దిని కూడా చేసి చూపిస్తున్నారని చెప్పారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను తీర్చడానికి ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు.మనము జగన్మోహన్రెడ్డి అడుగుజాడల్లో నడుస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా పల్లెల సమస్యలను తీర్చడానికి ప్రత్యేక కార్యచరణ ప్రణాళిక తయారు చేశామన్నారు. అందులో బాగంగా రామిరెడ్డిపల్లె 98మందికి ఇంటి స్థలాలు ఇవ్వడము జరిగిందన్నారు.అలాగే శ్మశాన వాటికలు, ఇలా అన్ని సమస్యలపై దృష్టిపెట్టామని చెప్పారు. అందుకు మరో మారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుంటే మనకు మరిన్ని పథకాలు అందుతాయని చెప్పారు.

## జగనన్నతోనే భవిష్యత్తుకు భరోసా

- మేయర్ బి వై రామయ్య



**కర్నూలు మున్సిపల్, జూలై 26, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్రెడ్డితోనే పేదల భవిష్యత్తుకు భరోసా లభించిందని వైయస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షులు నగర మేయర్ బి వై రామయ్య, నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్రెడ్డిలు అన్నారు. బుధవారం మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న 19వ వార్డు 47వ సచివాలయ పరిధిలోని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జోరువాన కురుస్తున్న కూడ కార్యక్రమం నిర్వహించడం విశేషం. ప్రతి ఇంటికి వెళ్లి బుక్లెట్ అందజేసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా నగర మేయర్ బి వై రామయ్య మాట్లాడుతూ అవినీతి రహిత పాలన సంకల్పంగా ప్రజాసంక్షేమమే ధ్యేయంగా అన్ని ప్రాంతాల అభ్యున్నతే లక్ష్యంగా సమర్థవంతంగా పాలన అందిస్తున్న దమ్మున్న ఏకైక వ్యక్తి మన ముఖ్యమంత్రి అన్నారు. నవరత్నాలతో ఆయనకు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందన్నారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్రెడ్డి మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం రూ.20 లక్షలు విడుదల చేస్తే కల్లూరు అర్బన్కుమాత్రం అదనంగా రూ.3 కోట్ల మంజూరు అయ్యాయన్నారు. ఒకొక్క సచివాలయానికి రూ.40 లక్షలు కేటాయించేందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటి మేయర్ సిద్దారెడ్డి రేణుక, రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టరు గోపాల్రెడ్డి, జిల్లా వ్యవసాయసలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర్రెడ్డి, మహిళా విభాగం జోనల్ ఇంచార్జీ శ్వేతారెడ్డి, కార్పొరేటరు నాగలక్ష్మి, లక్ష్మికాంతరెడ్డి, నారాయణరెడ్డి, సుదర్శన్రెడ్డి, సానా శ్రీనివాసులు, అయిషా సిద్ధిఖా, విక్రమ్సింహారెడ్డి, అదనపు కమిషనరు రామలింగేశ్వర్, ఎఈ జనార్ధన్ నాయకులు కనికే శివరాంస్వామి, బాలచంద్రారెడ్డి, విష్ణువర్ధన్రెడ్డి, డిష్ అనిల్, బాబన్న, యూసుప్, లక్ష్మీపతి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్కడ చూసిన కండ్ల కలక...!

- అంటురోగాలతో అందోళన చెందుతున్న ప్రజలు
- రోజు రోజుకు పెరుగుతున్న అంటువ్యాధి...

**నందవరం, జూలై 26, ప్రభాతవార్త:** మండలంలోని ప్రస్తుతం ఎక్కడ చూసినా కండ్ల కలక వ్యాధి కలవరపెడుతుంది. ఈవ్యాధి అత్యంత వేగంగా ఒకరి నుండి మరోకరికి సోకుతుంది. వర్షాకాలం వచ్చే వ్యాధుల్లో ఇది ఒకటి. ఈవ్యాధి పట్ల ప్రజలు అంటు రోగాలతో అందోళన చెందుతూ ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, చదువుకునే విద్యార్థుల్లో అక్కడక్కడా పెద్దవారిలోను ఇది కనిపిస్తోంది. దీనికి సొంత వైద్యం, ఇంటి చిట్కాలు పనిచేయవు. ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదించి జాగ్రత్తలు పాటించాలి. ప్రభుత్వ వైద్యాధికారి డా.సౌజన్య లత వ్యాధి సోకే వారికి ముందు లక్షణాలు..ఎలర్జీ, దురద, కళ్ళనుండ నీరు కారడం, కన్ను ఎరుపుగా మారడం, వాపు కాంతిని సరిగా చూడలేకపోవడం జరుగుతూ ఉంటుంది. తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. కండ్ల కలక వచ్చినప్పుడు కళ్ళను నలపకూడదు, కంటిని తాకిన చేత్తో మరోకంటిని తాకకూడదు, చల్లని నీటితో కడగాలి. అధిక సూర్యరశ్మి, టివిలు, సెల్ఫోన్లు చూడరాదు. చలువరాతి కళ్ళ అద్దాలు ఉపయోగించాలి. కండ్ల కలక వచ్చిన విద్యార్థులు స్కూల్కు వెళ్లరాదు. వారితో పాటు మరోకరికి వచ్చే ప్రమాదం అధికంగా ఉంటుంది. నదులు, కాల్వల్లో స్నానాలు చేయరాదు, వారు ఉపయోగించు దస్తులు, సబ్బులు మరోకరు ఇతరు ఉపయోగించరాదు, చల్లటి తెల్లని గుడ్డను కండ్లపై పెట్టుకోవాలి. ఈవ్యాధి పట్ల పిహెచ్సిల్లోను, గ్రామ సచివాలయ హెల్త్ సెంటర్లలో ఎప్పటికప్పుడు ప్రజలకు వైద్యం అందిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## చిన్నపాటి వర్షానికే..వీధులన్నీ వాగులయ్యే..



**హొళగుంద, జూలై 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చిన్నగోనెహాల్ గ్రామంలో చిన్నపాటి వర్షానికే వీధులన్నీ వాగులయ్యాయి. దీంతో పిల్లలు,వృద్ధులు,ప్రజలు తిరగడానికి కష్టంగా మారింది. అయితే అక్కడ ఉన్న పంచాయతీ సెక్రటరీ కానీ,సర్పంచ్ కానీ ఎటువంటి చలనం లేకుండ వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. బుధవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తాలుక సహాయ కార్యదర్శి నాగరాజు గ్రామంలో కాలనీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కూడా ఇదేవిధంగా జరిగినా తూతూమంత్రంగా ఒక సందులో మాత్రమే మట్టి వేసి చేతులు దులుపుకున్నారన్నారు. ఇప్పటికీ వాల్మీకి వీధుల గుండా ప్రజలు తిరగడానికి చాలా కష్టంగా ఉందన్నారు. అయితే పంచాయతీ నిధులన్నీ ఎక్కడికి వెళ్తున్నాయో అర్థం కాని పరిస్థితి నెలకొందని,పన్నుల రూపంలో వసూలు చేసిన నిధులను కూడా ఎక్కడ ఖర్చు పెడుతున్నారో ప్రజలకు చెప్పాల్సిన భాధ్యత అధికారులకు ఉందన్నారు. సర్పంచ్,పంచాయతీ సెక్రటరీ,అధికారులు కుమ్మక్కై ఈ డబ్బులను జల్సా చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఎందుకంటే చిన్నపాటి వర్షాలకే వీధులన్నీ వాగులై నీరుపారుతున్నా ఏ అధికారి కళ్లకు కనిపించడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. నీరు నిల్వ ఉన్న చోట నివసించే ప్రజలకు ఏ రోగాలు వస్తాయోనని భయాందోళన చెందుతున్నారు. కావున తహశీల్దార్,ఎంపిడిఓలు ప్రత్యేక శ్రద్ధ వహించి పెద్దగోనెహాలు గ్రామంలో రోడ్లు,డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరించి ప్రజలకు మేలు చేకూర్చాలని డిమాండ్ చేశారు.

## ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్కు భూములను గుర్తించండి - జేసీ



**కర్నూలు, జూలై 26, ప్రభాతవార్త :** ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ నిర్మాణం కోసం అవసరమైన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య రెవెన్యూ, సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలు నందు ఏపిఐఐసి భూములకు సంబంధించి రెవెన్యూ, సంబంధిత అధికారులతో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఓర్వకల్లు మెగా ఇండస్ట్రియల్ హబ్ కోసం అవసరమైన భూములను త్వరితగతిన సేకరించి ఏపిఐఐసి వారికి అందజేయాలని కర్నూలు ఆర్డీఓ, తహశీల్దార్లను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా అక్కడ త్రాగు నీటి కోసం ఏర్పాటు చేయనున్న పైప్ లైన్స్ ఉన్న అడ్డంకులను కూడా తొలగించేలా రెవెన్యూ అధికారులు కృషి చేయాలన్నారు. ఏపిఐఐసికి కేటాయించిన భూములను కూడా మ్యుటేషన్స్ ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో ఏపిఐఐసి జోనల్ మేనేజర్ టి.కృష్ణమోహన్ రావు, కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్, సర్వే ఏడి శ్రీరామ్మోహన్, కర్నూలు రూరల్ తహశీల్దార్ ఆర్.శివరాముడు, కల్లూరు తహశీల్దార్ రమేష్ బాబు, ఓర్వకల్లు తహశీల్దార్ శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి కొళాయిలను ప్రారంభించిన ఎమ్మెల్యే



**తుగ్గలి, జూలై 26, ప్రభాతవార్త :** మండల పరిధిలోని నల్లగుండ్ల గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేకు స్థానిక వైసిపి నాయకుడు నాగేశ్వరరావు,నాగరాజు,అశోక్,మండల నాయకులతో కలిసి ఎమ్మెల్యేకు గజమాలతో ఘనంగా సన్మానించారు. ముందుగా ఎమ్మెల్యే శ్రీదేవమ్మ గ్రామంలో మంచినీటి సమస్యను తీర్చేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయిలను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ప్రతి గడపకు వెళ్లి లబ్దిని వివరించారు. ఈ కార్యక్రమంలో నునసరాళ్ల సర్పంచ్ గౌరవ సలహాదారుడు గోపాల్రెడ్డి,ఎంపిటిసి జిల్లా సుంకన్న,వైసిపి కన్వీనర్ జిట్టా నాగేష్,సచివాలయం కన్వీనర్ హనుమంతు, జగన్నాథ్ రెడ్డి,తుగ్గలి మోహన్రెడ్డితో పాటు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొంగిపొరలుతున్న నల్లవాగు చెరువు

- లోతట్టులో మొక్కజొన్న జలమయం
- రోడ్డుఎక్కిప్రవహిస్తున్న నీటి వరద
- రాకపోకలకు తీవ్ర అంతరాయం

**పగిడ్యాల, జూలై 26, ప్రభాతవార్త :** బంగాళఖాతంలో ఉపరితల అవర్తనం ప్రభావంతో పగిడ్యాల మండలం ఎగువప్రాంతంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కుంటలు చెరువులు వంకలు వాగులు పొంగిపొరలుతున్నాయి. దీంతో రాకపోకలకుఅంతరాయం ఏర్పడటంతోపాటు దిగువప్రాంతంలో ఉన్న మొక్క.జొన్నపంటలు నీట మునిగిపోవడంతో రైతులు అందోళన చెందుతున్నారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నల్లవాగు చెరువు నిండిప్రవహించడంతో సమీపంలో ఉన్న దాదాపు30ఎకరాలలో సాగుచేసిన మొక్కజొన్న పంట మునిగిపోవడంతో రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. రుతుపవనాలు రాక అలస్యం అయిందని ఎదురు చూస్తున్న నేపథ్యం భారీ వర్షాల కారణంగా మొక్కజొన్న సాగుచేసిన పంట తీవ్రంగా దెబ్బతిన్నాయనీ రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మూల్గేనక్కపై తాటికాయ పడ్డ చందంగా పరిస్థితి నెలకొందని రైతులు పేర్కొంటున్నారు. నల్లం బొట్లమ్మ దగ్గర 40మీటర్ల పొడవు రోడ్డుపై నీళ్లు ప్రవహించడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పొలాలు చూసుకునేందుకు వెళ్లిన రైతులు, ద్విచక్రవాహనందారులు ఇబ్బందులకు గురయ్యామని రైతులు, బాటసారులు తెలిపారు. ఇంతటితో వర్షం వరపు ఇస్తే బాగుంటుందనీ రైతులు తెలిపారు.

